బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా

లోపలి పేజీల్లో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 177 | విజయవాడ, ఆదివారం 29 జనవరి 2023 | 6 + 8 పేజీలు + స్నేహ పేజీలు వెల : 7.00

Vol No Vijayawada, Sunday 29 January 2023 Rs

- మహిళల ఛాంప్ సబలెంకా
- హోరాహోరీ ఫైనల్లో రైబకినాపై గెలుపు

లోపలి పేజీల్లో..

'ఉద్యోగ విరమణ'పై నకిలీ జిఓ కలకలం

తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం

ఎఫ్ఐఆర్ నమోదు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 65 సంవత్సరాలకు పెంచుతున్నట్లు పేర్కొంటూ ఒక నకిలీ జిఓ జారీ కావడం కలకలం రేపింది. ఆర్థికశాఖ పేరిట ఉండటంతో పాటు, చూడటానికి అసలైన ప్రభుత్వ ఉత్తర్వుల మాదిరే కనపడుతున్న ఈ నకిలీ జిఓ శనివారం ఉదయం నుండి సోషల్ మీడియాలో విస్తృతంగా సర్క్యులేట్ అయింది. దీంతో పభుత్వ ఉద్యోగులతో పాటు, సాధారణ ప్రజానీకంలోనూ భారీ స్థాయిలో చర్చ సాగింది. ప్రస్తుతం ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలుగా ఉన్న సంగతి తెలిసిందే. దీనిని మరో ఏడాది పెంచే అవకాశం ఉందంటూ కొన్ని రోజులుగా ఉద్యోగవర్గాల్లో చర్చ సాగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన వ్యక్తం కాలేదు. ఏడాది పెంపు ప్రతిపాదనపైనే ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాగా, నిరుద్యోగుల్లోనూ, యువతలోనూ తీవ్ర వ్యతిరేకత కనిపించింది. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా 65 సంవత్సరాలకు పెంచారంటూ ఉత్తర్వులు వెలువడటం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. ఒకేసారి ఇన్నేళ్ల పెంపు ఏమిటంటూ ఉద్యోగులంతా అవాక్కయ్యారు. సచివాలయంలోనూ తీవ్ర స్థాయిలో గందరగోళం నెలకొంది. 15వ నంబర్‌తో విడుదలైన ఈ జిఓలో పభుత్వ ఉత్తర్వుల్లో ఉండే అన్ని అధికారిక పద ప్రయోగాలు కూడా ఉన్నాయి. దిగువన సంతకం దగ్గర కూడా 'గవర్నర్ తరపున' అన్నది కూడా స్పష్టంగా ఉండడంతో ఉద్యోగులంతా దీనిని నిజమైన జిఓగానే అయితే ఉత్తర్వులు ఇచ్చిన సమయంలో రిఫరెన్స్‌గా పాత ఉత్తర్వుల వివరాలు కూడా పొందుపరచాల్సి ఉంటుంది. తాజా ఉత్తర్వుల్లో ఆ వివరాలు కనిపించలేదు. ఈ నకిలీ ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నకిలీ ఉత్తర్వులను తయారు చేసిన వారిని, వాటిని ప్రచారంలోకి తీసుకొచ్చిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ఆర్థికశాఖ అధికారులు గుంటూరు జిల్లా డిఐజికి ఫిర్యాదు చేశారు. ఆయన తక్షణ చర్యలకు జిల్లా ఎస్‌పికి ఆదేశాలు జారీ చేశారు. ఇవి పూర్తిగా తప్పుడు ఉత్తర్వులని, వీటిని ఉద్యోగులు, ప్రజలు నమ్మవద్దంటూ ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్‌సింగ్ రావత్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఎక్కడి నుంచి ఈ ఉత్తర్వుల కాపీ బయటకు వచ్చిందన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో బిసిలకు 34% రిజర్వేషన్

- రెండవ రోజు పాదయాత్రలో లోకేశ్

లోపలి పేజీల్లో..

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

ప్రమాదంలో ప్రజల సొమ్ము

- విత్త సంస్థలకు అదానీ గండం..!
- బ్యాంక్‌ల నుండి లక్షల కోట్ల అప్పు
- భారీగా ఇన్వెస్ట్ చేసిన ఎల్ఐసి

న్యూఢిల్లీ : బ్యాంక్‌లు, బీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్లలో పొదుపు చేసుకున్న ప్రజల సొమ్ము ప్రమాదంలో పడింది. అక్కౌంట్స్ మోసాలు, మనీలాండరింగ్ ఆరోపణల్లో చిక్కుకున్న అదానీ గ్రూపు కంపెనీలకు అనేక విత్త సంస్థలు భారీగా అప్పులు ఇవ్వడం, ఈక్విటీ రూపంలో పెట్టుబడులు పెట్టడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అమెరికన్ పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ అదానీ అవకతవకలపై విడుదల చేసిన 108పేజీల నివేదికపై ఆ సంస్థకానీ, కేంద్ర ప్రభుత్వం కానీ ఇప్పటివరకు పెదవి విప్పని సంగతి తెలిసిందే. దీంతో వివిధ రూపాల్లో ఆ గ్రూపునకు వెళ్లిన ప్రజల కష్టార్జితం ఎంతవరకు సురక్షితమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసి అదానీ గ్రూపు సంస్థల్లో కొన్ని సంవత్సరాలుగా భారీ మొత్తంలో పెట్టుబడులు పెడుతోంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో 2021 జూన్ 30 నాటికి 1.32 శాతం వాటా ఉండగా, 2022 సెప్టెంబర్ 30 నాటికి 4.02 శాతానికి పెరిగింది. అదానీ టోటల్ గ్యాస్‌లో 2.11 శాతం నుంచి 5.77 శాతానికి పెంచుకుంది. అదానీ పోర్ట్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పవర్, అంబూజా సిమెంట్, ఎసిసి తదితర అదానీ గ్రూపు కంపెనీల్లో ఎల్ఐసి రూ.80వేల కోట్ల పెట్టుబడులను కలిగి ఉంది. అదానీ అవకతవకలు వెలుగులోకి వచ్చిన తరువాత రెండు రోజుల్లో ఎల్ఐసి రూ.18వేల కోట్ల మేర నష్టాలు చవి చూసింది. అయినా, అదానీ ఎంటర్‌ప్రైజెస్ తాజాగా జారీచేసిన రూ. 20,000 కోట్ల ఎఫ్‌పిఒలో మరో 300 కోట్ల రూపాయలను పెట్టుబడులుగా పెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదానీ గ్రూపు కంపెనీల షేర్లు మరింత పడిపోతే ఎల్ఐసి పెట్టుబడులు మరింత

మిగతా 2లో

కంపెనీ పేరు	బ్యాంక్ అప్పు (రూ. కోట్లు)
అదానీ పవర్	32,328
అదానీ రెన్యూవెబుల్స్	20,664
అదానీ ఎంటర్‌ప్రైజెస్	17,945
అదానీ పోర్ట్స్ అండ్ లాజిస్టిక్స్	5,183
అదానీ ట్రాన్స్‌మిషన్	5,115

విశాఖపై పంజా!

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

గడిచిన నాలుగు రోజులుగా స్టాక్ మార్కెట్లను కుదిపేస్తోన్న గౌతమ్ అదానీ మోసాలు, ఆర్థిక దారుణాలు ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ చోటు చేసుకున్నాయి. అదానీ మోసాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా సాగిలపడ్డాయో కళ్లకు కట్టినట్లు ఉదాహరణలు ఉన్నాయి. ప్రజా వనరులను అదానీకి కట్టబెట్టేందుకు నిబంధనలు సడలిస్తూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి దొందూ దొందుగానే వ్యవహరించాయి. విశాఖ ఉమ్మడి జిల్లాలో రూ.వేల కోట్ల విలువైన ప్రజా సంపదలను ఇప్పటికే కట్టబెట్టేశాయి. రాష్ట్రంలోని ప్రయివేట్ పోర్టులన్నింటినీ అదానీ గ్రూప్ సంస్థ హస్తగతం చేసుకుంది. విశాఖలోని ప్రభుత్వ పోర్టు (విపిటి), గంగవరం ప్రైవేట్ పోర్టు)లపై అదానీ తన 'పంజా' విసిరాడు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను

మిగతా 2లో

అదాని సంస్థల్లో ఎల్ఐసి వాటాలు

కంపెనీ	వాటాల సంఖ్య	%	పెట్టుబడి విలువ (రూ. కోట్లలో) జనవరి 24	జనవరి 27	మార్పు
అదాని టోటల్ గ్యాస్	6,55,88,170	5.96	25,484	19,247	-6,237
అదాని ఎంటర్‌ప్రైజెస్	4,81,74,654	4.23	16,585	13,307	-3,279
అదాని పోర్ట్సు	19,75,26,194	9.14	15,029	11,824	-3,205
అదాని ట్రాన్స్‌మిషన్	4,06,76,207	3.65	11,211	8,175	-3,036
అంబుజా సిమెంట్స్	12,55,89,263	6.33	6,261	4,787	-1,474
అదాని గ్రీన్ ఎనర్జీ	2,03,09,080	1.28	3,886	3,015	-871
ఎసిసి	1,20,33,271	6.41	2,811	2,267	-544
మొత్తం			81,268	62,621	-18,647

ప్రభుత్వ సంస్థలే ఎలా? జైరామ్ రమేష్

అదానీ గ్రూపునకు ప్రైవేటు సంస్థలకన్నా ప్రభుత్వ సంస్థలే ఎక్కువ రుణాలు ఇవ్వడంతో పెట్టుబడులు కూడా పెట్టాయని ఇది ఎలా సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేష్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి అదానీ అత్యంత సన్నిహితుడైనందున తాజా ఆరోపణలకు ప్రాధాన్యత పెరగిందని పేర్కొన్నారు. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండి అదానితో అనుబంధం కొనసాగుతున్న విషయాన్ని దేశ ప్రజలు గుర్తించాలన్నారు.

ప్రజల ప్రయోజనాలు కాపాడండి : సీతారాం ఏచూరి

అదాని గ్రూపు అవకతవకల వ్యవహారంలో ప్రజల ప్రయోజనాలను కాపాడాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. ఈ మేరకు చేసిన ట్వీట్‌లో అదాని గ్రూపుపై వచ్చిన ఆరోపణలు నిజమైతే కోట్లాది మంది ప్రజల జీవితాలు నాశనం అవుతాయని పేర్కొన్నారు,.

వివేకాతో వైరానికి కారణాలేంటి?

ఎంపి అవినాష్‌రెడ్డిని ప్రశ్నించిన సిబిఐ • నాలుగు గంటలకుపైగా విచారణ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో, కడప ప్రతినిధి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా శనివారం కడప ఎంపి అవినాష్‌రెడ్డి సిబిఐ ఎదుట హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో తన వ్యక్తిగత లాయర్, అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని కోఠిలోగల సిబిఐ కార్యాలయానికి చేరుకున్నారు. అవినాష్‌రెడ్డిని మినహా ఇతరులెవ్వరినీ అధికారులు లోపలికి అనుమతించలేదు. సిబిఐ ఎస్‌పి రామ్‌సింగ్ నేతృత్వం లోని ఐదుగురు బృందం నాలుగు గంటలకుపైగా ఆయనను ప్రశ్నించింది. వైఎస్ వివేకానందరెడ్డితో ఉన్న విభేదాలకు కారణాలేంటనే దానిపైనే సిబిఐ ప్రధానంగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే సిబిఐ సేకరించిన వాంగ్మూలాలు, ఇతర సాక్ష్యాధారాలను బట్టి ఆరా తీసింది. వివేకా హత్య విషయం బైటకు తెలిసిన వెంటనే, ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాతే ప్రకటన చేశారా? హత్య జరిగిన ప్రాంతంలో రక్తపు మరకలు, ఇతర సాక్ష్యాలను ఎందుకు తొలగించారు? అని సిబిఐ ఎస్‌పి ప్రశ్నించినట్లు తెలిసింది. చాలా ప్రశ్నలకు అవినాష్‌రెడ్డి తనకు తెలియదనే సమాధానం చెప్పినట్లు సమాచారం. సిబిఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన అనంతరం మీడియాతో అవినాష్‌రెడ్డి మాట్లాడారు.

సిబిఐ అధికారులు ఇచ్చిన 160 సిఆర్‌పిసి నోటీసుల ప్రకారం విచారణకు హాజరయ్యానని తెలిపారు. సిబిఐ అధికారుల ప్రశ్నలకు సమాధానమిచ్చానని చెప్పారు. కేసు విచారణ పారదర్శకంగా జరగాలని సిబిఐని కోరానని తెలిపారు. తిరిగి ఎప్పుడు విచారణకు రమ్మన్నా వస్తానని తెలిపినట్లు చెప్పారు. ఈ కేసులో తనను బదనాం చేసేలా ప్రచారం జరుగుతోందని, ఎంపినైన తాను ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సి ఉందన్నారు. ఈ దృష్ట్యా విచారణకు వీడియో, ఆడియో రికార్డింగ్ అనుమతి కోరానని, అందుకు అధికారులు అంగీకరించలేదని తెలిపారు. విచారణ విషయాలు ఏవీ ఇప్పుడు బహిర్గతం చేయలేనని అవినాష్‌రెడ్డి చెప్పారు. సిబిఐ కార్యాలయానికి అన్నమయ్య జిల్లాకు చెందిన రాయచోటి, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులతోపాటు అవినాష్‌రెడ్డి అనుచరులు భారీగా చేరుకున్నారు. దీంతో, పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అవినాష్‌రెడ్డి తొలిసారిగా సిబిఐ విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యంలో కడప జిల్లాలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఐదుగురు నిందితులకు సమన్లు

వైఎస్ వివేకా హత్య కేసులో ఐదుగురు నిందితులకు సిబిఐ కోర్టు సమన్లు జారీ చేసింది. హత్య కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎర్ర గంగిరెడ్డి, వై.సునీల్ యాదవ్, జి.ఉమాశంకరరెడ్డి, షేక్ దస్తగిరి, డి.శివశంకర్‌రెడ్డి శనివారం నోటీసులు అందాయి. ఫిబ్రవరి పదిన సిబిఐ కోర్టుకు హాజరు కావాలని ఆ ఆదేశాల్లో కోర్టు పేర్కొంది. కేసు పూర్వాపరాల విచారణలో భాగంగా ఇటీవల కడప కోర్టు నుంచి కేసుకు సంబంధించిన ఫైళ్లను సిబిఐ కోర్టుకు తెప్పించుకున్న సంగతి తెలిసిందే.

248 మంది వాఙ్మూలం సేకరణ

2019 మార్చి 15న మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య జరిగినప్పటి నుంచి నేటి వరకు సుమారు నాలుగేళ్ల వ్యవధిలో జిల్లా కేంద్రమైన కడప, పులి వెందుల నుంచి బెంగళూరు వరకు వివిధ కోణాల్లో విచారించిన అనంతరం సిబిఐ బృందం 248 మంది నుంచి వాంగ్మూలాన్ని సేకరించింది. వీరిలో ఐదుగు రిని ప్రధాన నిందితులుగా గుర్తించింది. వారిలో వివేకా మాజీ డ్రైవర్ దస్తగిరి అప్రూవర్‌గా మారారు.

అచ్చెన్నపై కేసు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుపై చిత్తూరు జిల్లా కుప్పం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో శనివారం కేసు నమోదైంది. శుక్రవారం 'యువగళం' బహిరంగసభ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రకు 500 మంది పోలీసులను పెట్టామని అధికారులు చెబుతున్నారని, అంతమందిని ఎందుకు పెట్టారంటూ చేసిన వ్యాఖ్యలపై పోలీస్‌శాఖ తీవ్రంగా స్పందించింది. ఆ సందర్భంగా పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎస్ఐ శివకుమార్ కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో, కుప్పం పోలీసులు అచ్చెన్నాయుడుపై 153 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

భవిష్యత్‌లోనూ నాబార్డు తోడ్పాటు

- సిఎం జగన్‌తో ఛైర్మన్ షాజి కెవి భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భవిష్యత్తులో కూడా నాబార్డు ఇప్పుడు అందిస్తున్న విధంగానే తోడ్పాటును అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. నాబార్డు ఛైర్మన్ షాజి కెవి ప్రతినిధుల బృందం శనివారం క్యాంపు కార్యాలయంలో సిఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాబార్డు సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలుపై సమావేశంలో చర్చించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో నాబార్డు సహాయంతో చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు నడుస్తున్నాయని నాబార్డు బృందానికి ముఖ్యమంత్రి తెలియజేశారు. నాబార్డు సహాయంతో చేపడుతున్న 'మన బడి నాడు - నేడు', కొత్త వైద్య కళాశాల నిర్మాణంతో పాటు వ్యవసాయ రంగంలోనూ అనేక కార్యక్రమాలు సమర్ధవంతంగా

కొనసాగుతున్నాయని నాబార్డ్ ఛైర్మన్ షాజి కెవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా చేపడుతోందని ప్రశంసించారు. మహిళా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు కూడా జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరుస్తున్నాయని తెలిపారు.

హమాలీల కూలీ రేట్లు పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పౌరసరఫరాలశాఖ ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేసే హమాలీలకు (హ్యాండ్లింగ్ కమోడిటీస్) కింద క్వింటాలుకు రూ.3లు కూలీ రేట్లను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు జీఓ ఆర్‌టి నెంబరు3ని ప్రభుత్వం విడుదల చేసింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో తమకు హమాలీ చార్జీలు పెంచాలని యూనియన్ల నుంచి డిమాండ్ వచ్చిన నేపథ్యంలో తాజాగా క్వింటాలుకు రూ.22నుంచి రూ.25లకు చార్జీలు పెంచినట్లు జీఓలో ప్రభుత్వం పేర్కొంది. వీటితో పాటు స్వీపర్స్ చార్జీలు, కుట్టుకూలీ, స్వీట్ ప్యాకెట్, డ్రింకింగ్ వాటర్ ధరలను ప్రభుత్వం పెంచింది. కూలీరేట్లు పెంచడం పట్ల ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ (సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.కృష్ణ, ఎస్.ఉదయ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే అరియర్స్ బకాయిలను కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎయిర్‌ఫోర్స్‌లో విషాదం

కూలిన రెండు జెట్ విమానాలు • ఒక పైలెట్ మృతి

భోపాల్ : భారత వాయుసేనలో శనివారం విషాదం సంభవించింది. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన రెండు యుద్ధవిమానాలు శనివారం కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఒక పైలెట్ మృతి చెందారు. రోజువారీ శిక్షణలో భాగంగా ఉదయం మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ఎయిర్ బేస్ నుంచి బయలుదేరిన సుఖోయ్-30, మిరాజ్-2000 విమానాలు కొన్ని నిమిషాల్లోనే మొరెనా ప్రాంతంలో కూలిపోయాయి. సుఖోయ్‌లో ఇద్దరు పైలట్లు, మిరాజ్‌లో ఒక పైలెట్ ఉన్నారు. మిరాజ్‌లో ఉన్న పైలెట్ హనుమంతరావు సారధి మృతిచెందారు. గాయపడిన మరో ఇద్దరు పైలెట్లను హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. సుఖోయ్‌కు చెందిన కొన్ని శకలాలను మొరెనా ప్రాంతానికి సుమారు 100 కిలో మీటర్ల దూరంలో ఉన్న రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లోనూ గుర్తించారు. ఈ ప్రమాదంపై భారత వాయుసేన విచారణకు ఆదేశించారు. గాల్లో ఉండగా, రెండు విమానాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఈ ప్రమాదంపై ఎయిర్ స్టాఫ్ చీఫ్ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. ప్రమాదం రాజ్‌నాథ్ సింగ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోషల్ మీడియా ద్వారా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విశాఖలో 30న ఉక్కు ప్రజా గర్జన

భారీ జన సమీకరణకు సిద్ధమైన కార్మిక, ప్రజా సంఘాలు

మోడీ సర్కారు మెడలు వంచే కార్యాచరణకు స్టీల్ కార్మికులు శ్రీకారం

బహిరంగ సభకు బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీల నేతలూ హాజరు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉక్కు పరిరక్షణ ఉద్యమం ఊపందుకుంటోంది. పోరాట పంథాను, స్వరూపాన్ని మార్చేందుకు స్టీల్ కార్మికులు శ్రీకారం చుట్టారు. ఈ నెల 30న సోమవారం ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో సాయంత్రం మూడు గంటలకు 'ఉక్కు ప్రజా గర్జన' పేరుతో భారీ సభను నిర్వహించేందుకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి సమాయత్తమవుతున్నాయి. ఈ మేరకు రాజకీయ పార్టీల నాయకులకూ ఆహ్వానాలు వెళ్లాయి. ఉక్కు ప్రజా గర్జన బహిరంగ సభలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల (బిజెపి మినహా)కు చెందిన రాష్ట్ర నాయకులు పాల్గొననున్నారు. పోరాట స్వరూపాన్ని మార్చే దిశగా ప్రణాళికలు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేస్తున్నట్లు మోడీ ప్రకటన చేసి ఈ నెల 27 నాటికి రెండేళ్లయింది. ఈ కాలంలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అనేక రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు విశాఖ సహా రాష్ట్ర వ్యాప్తంగా సాగాయి. 'అమ్మేస్తాం... లేదంటే మూసేస్తాం'... అనే విధానంతోనే కేంద్రంలోని బిజెపి, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మొండిపట్టుతో ముందుకు సాగడంతో ప్రజానీకంలోనూ కేంద్రం చర్యలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

రెండేళ్ల తర్వాత మారుతున్న పోరాట రూపం

పోరాట రూపాలను మార్చాలంటూ ప్రజానీకంలో చర్చ జరగడం కనిపిస్తోంది. బలమైన ఉద్యమాలు నిర్వహించి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలన్న కాంక్ష ఈ ప్రాంత ప్రజల్లో.. ముఖ్యంగా గాజువాక ఏరియాలో జనం నుంచి అభిప్రాయంగా వినిపిస్తోంది. ఉత్తరాంధ్ర లోని ఉమ్మడి మూడు జిల్లాల్లోగల స్థానిక సంస్థలు, గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) కూడా తీర్మానం చేసి 'ఉక్కు ప్రయివేటీకరణ' ఆపాలంటూ ప్రభుత్వానికి పంపాయి. ఫోరం ఫర్ విశాఖ బెటర్ డవలప్‌మెంట్ ప్రతినిధి, మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాస్తూ, స్టీల్‌ప్లాంట్ ఈ ప్రాంత ప్రజల సెంటిమెంట్ అని, విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి స్టీల్‌ప్లాంట్, వైజాగ్ పోర్టు కీలకమని వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కేంద్రం చర్యలపై రెండు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు, మానవహారాలు, సమ్మెలు, రాష్ట్ర వ్యాప్త బంద్‌లు కూడా జరిగాయి. 32 మంది ఆత్మబలిదానం ఫలితంగా ఏర్పాటైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామంటూ నానాటికీ ఉద్యమ స్వభావం ఈ ప్రాంత ప్రజానీకంలో పెరగడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. 30న ఉక్కునగరం లోని తృష్టా గ్రౌండ్స్‌లో జరిగే సభకు భారీ ఎత్తున ప్రజలు, వివిధ రంగాల కార్మికులు తరలిరానున్నారు.

హాజరు కానున్న ప్రధాన పార్టీల రాష్ట్ర నేతలు

'ఉక్కు ప్రజా గర్జన' సభకు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు హాజరవుతున్నారు. అధికార వైసిపి నుంచి వైవి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, టిడిపి నాయకులు, మాజీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి గిడుగు రుద్రరాజు, స్థానిక గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరు కానున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో

బిసిలకు 34 శాతం రిజర్వేషన్

● కార్మిక బీమా రూ.10 లక్షలకు పెంపు ● 'యువగళం' రెండోరోజు నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే 'స్థానిక' సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. అలాగే గతంలో టిడిపి అధికారంలో ఉన్నపుడు కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.ఐదు లక్షలు, సహజ మరణమైతే రూ.రెండు లక్షలు ఇచ్చామని, దాన్ని రెట్టింపు చేస్తూ కార్మిక బీమాను రూ.10 లక్షలు చేస్తామని తెలిపారు. నారా లోకేష్ 'యువగళం' పాదయాత్ర రెండో రోజు పిఇఎస్ మెడికల్ కళాశాల నుంచి ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైంది. పెగ్గిలపల్లి, కడపల్లి, కలమలదొడ్డి మీదుగా శాంతిపురం మండలం కోడూరు వరకు 9.7 కిలో మీటర్ల మేర సాగింది. కడపల్లి వద్ద బిసిలతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ స్పందిస్తూ బిసిలకు రిజర్వేషన్ తెచ్చింది ఎన్టి రామారావు అని, ఎన్‌టిఆర్ 20 శాతం బిసిలకు రిజర్వేషన్ ఇస్తే, చంద్రబాబునాయుడు 34 శాతం స్థానిక సంస్థల్లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక దాన్ని పది శాతానికి తగ్గించారని విమర్శించారు. 16 వేల మంది బిసిలు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కోల్పోయారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే బిసిలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర బడ్జెట్ నుంచే ఆయా కులదేవుళ్లకు గుడులు కట్టిస్తామని చెప్పారు. అలాగే ఐదు లక్షలు ఉన్న బీమాను రూ.10 లక్షలు చేస్తామని తెలిపారు. కుప్పంలో వడ్డెర కులస్తులు చేసుకుంటున్న క్వారీలను తిరిగి వారికే అప్పగిస్తామన్నారు. ఆదరణ-2 పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. చేతివృత్తులను కాపాడుకునేందుకు తన అడుగులో అడుగు వేయాలని కోరారు. భోజన విరామం అనంతరం సాయంత్రం 4 గంటలకు కడపల్లిలో ప్రారంభమైన పాదయాత్ర పోగలం, తులసినాయనిపల్లి వద్దకు చేసుకుంది. అక్కడ వన్నెకుల క్షత్రియులతో సమావేశమయ్యారు. పూలు, పండ్లు, కాయగూరలు పండిస్తున్నామని, సరైన మార్కెట్ లేదని లోకేష్ దృష్టికి తెచ్చారు. విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ శాంతిపురానికి ఎయిర్‌పోర్టును తీసుకొచ్చి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తానని భరోసా ఇచ్చారు. పెద్దబొమ్మనపల్లి సమీపంలోని వాదులచెరువు వద్ద సాయంత్రం ఆరు గంటలకు రెండో రోజు పాదయాత్ర ముగిసింది. మూడో రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు శాంతిపురం మండలం వాదుల చెరువు నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుంది. బొడమకల్లపల్లి, కె.గెట్టపల్లి, కె.గెట్టపల్లి మీదగా చెల్దిగానిపల్లి వరకు 11 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగనుంది.

అభిమానులతో నారా లోకేష్ సెల్ఫీ

'ఉక్కు'ను ప్రయివేటుపరం కానివ్వం

● విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం కానివ్వబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, నాయకులు ఎన్.రామారావు, జె.రామకృష్ణ, బిహెచ్ఇఎల్ కార్మిక నాయకులు సాహూ, రవీంద్రనాథ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 716వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం పోరాటం ఉధృతమవుతోందని, ఈ క్రమంలోనే ఈ నెల 30న నగరంలోని తృష్ణా మైదానంలో ఉక్కు ప్రజా గర్జన సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని జయప్రదానికి ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోనూ ప్రచారం ఊపందుకుందని అన్నారు. అన్ని రాజకీయపక్షాలతో సభలు, సమావేశాలు నిర్వహించి మద్దతు కూడగడుతున్నామని తెలిపారు. ఉక్కు ప్రజాగర్జన సభను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపిస్తామన్నారు. దీక్షల్లో నాయకులు డి.దేముడు, డి.రమేష్, జి.ఆనంద్, ఎంకెవి.రాజేశ్వరరావు, జివి.రమణ, వైవి.సుబ్బారావు, ఆర్.సూరిబాబు, నమ్మి సింహాద్రి, శ్రీరామరాజు, మహ్మద్, కెవి.రమణ పాల్గొన్నారు.

రాష్ట్రానికి చెడు చేస్తోన్న వైసిపిలో ఎవ్వరూ ఉండొద్దు

● టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలందరినీ దెబ్బతీసి రాష్ట్రానికి చెడు చేస్తున్న వైసిపిలో ఎవరూ ఉండొద్దని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రం కోసం, యువత భవిత కోసం ఆ పార్టీలో ఉన్నవారంతా బయటకు రావాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు వైసిపి నేతలు టిడిపి కార్యాలయంలో ఆయన సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని భూ స్థాపితం చెయ్యాలని పిలుపునిచ్చారు. 'ఒక అవకాశం' పేరుతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో పేదలకు తీవ్రనష్టం జరుగుతోందన్నారు. ఎస్సిలకు టిడిపి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను జగన్ సర్కార్ రద్దు చేసిందన్నారు. 'వైఎస్ జగన్ చేతిలో అధికారం పిచ్చోడి చేతిలో రాయి'లా మారిందన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డిని విచారించడంతో జగన్ టెన్షన్‌లో పడ్డారని పేర్కొన్నారు. నిందితులను కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

కాగా టిడిపి యువ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'ర్యాపిడో ఆన్ బోర్డింగ్ సర్వీసెస్' ద్వారా ఉపాధి పొందిన యువతీయువకులను చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టిడిపి ప్రతినిధులు వేమూరి రవి, చప్పిడి రాజశేఖర్, డివి రావు, రాపిడో సంస్థ అడ్వైజర్ జి రామారావు పాల్గొన్నారు.

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

● నారాయణ హృదయాలయ వైద్యుల వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సినీ హీరో తారకరత్న ఆరోగ్యం విషమంగానే ఉందని నారాయణ హృదయాలయ వైద్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. అత్యంత విషమ పరిస్థితిలోనే ఆస్పత్రికి తీసుకొచ్చారని, వెంటనే అత్యవసర చికిత్స అందించామని, ప్రస్తుతం వివిధ విభాగాల నిపుణుల సమక్షంలో తారకరత్నకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికీ పరిస్థితి విషమంగానే ఉందని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన వైద్యం అవసరమని చెప్పారు.

ఆస్పత్రికి చేరుకున్న చంద్రబాబు, పురందేశ్వరి

తారకరత్న ఘటన విషయం తెలిసిన వెంటనే ఫోన్‌లో ఆరా తీసిన నారా చంద్రబాబునాయుడు శనివారం హైదరాబాద్ నుంచి బెంగళూరులోని నారాయణ హృదయాలయానికి చేరుకున్నారు.

వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పాదయాత్ర సందర్భంగా తారకరత్నకు హార్ట్ ఎటాక్ వచ్చిందని, కుప్పంలో అత్యవసర చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నారాయణ హృదయాలకు తరలించామన్నారు. వైద్యులు శాయశక్తులా కృషి చేస్తున్నారని, అబ్జర్వేషన్‌లో ఉంచారన్నారు. వైద్యులతో తాను స్వయంగా మాట్లాడానని, కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని చెప్పారన్నారు. తారకరత్న త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నామని, ప్రస్తుతం ఐసియులో చికిత్స కొనసాగుతోందని చెప్పారు. పురందేశ్వరి బెంగళూరుకు చేరుకుని తారకరత్న ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తారకరత్న ఆరోగ్యం నిలకడగానే ఉందని, సోమవారం మరోసారి పరీక్షలు నిర్వహించి, పరిస్థితి అంచనా వేస్తామని వైద్యులు చెప్పారని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వైసిపికి ఓటమి భయం

● టిడిపి ఎమ్మెల్సీ మంతెన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లోకేష్ చేపట్టిన పాదయాత్రతో సిఎం జగన్‌తో సహా వైసిపి నేతలకు ఓటమి భయం పట్టుకుందని టిడిపి ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. అందుకే యాత్రపై ప్రతి నిమిషం విషం చిమ్ముతున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి రోజా పర్యాటక శాఖను గాలికొదిలి సొంత పర్యటనల్లో మునిగి తేలుతున్నారని విమర్శించారు. తారకరత్న అస్వస్థతపై వైసిపి నేతలు నీచ రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అమ్ముతున్న కల్తీ మద్యం తాగి మూడున్నరేళ్లలో వందలాదిమంది చనిపోయారని తెలిపారు. రాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై ప్రమాదాల వల్ల ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని పేర్కొన్నారు. వీటన్నింటికి కారణం జగన్ కాదా అని ప్రశ్నించారు. లోకేష్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఎన్ని కుట్రలు చేసినా అడ్డుకోలేరని పేర్కొన్నారు. టిడిపి గెలుపు ఆపలేరని, తమ పార్టీ అధికారంలోకి వచ్చాక వైసిపి నేతలు ఇతర దేశాలకు పారిపోక తప్పదని తెలిపారు. యాత్ర పూర్తయ్యే ఆలోపు వైసిపి నేతలు వీసా ప్రక్రియ పూర్తిచేసుకోండని పేర్కొన్నారు.

అవినాష్ విచారణను చిత్రీకరించాలని కోరడం హాస్యాస్పదం

● టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డిని సిబిఐ విచారణ చేసే సమయంలో వీడియో చిత్రీకరించాలని అధికార వైసిపి కోరడం హాస్యాస్పదమని టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. స్వపక్షానికి ఒకలా విపక్షానికి మరోలా చట్టాలుంటాయన్నట్టుగా వైసిపి నేతలు మాట్లాడటం సిగ్గుచేటని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడున్నరేళ్ల నుంచి టిడిపి నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, కస్టోడియల్ టార్చర్ చేసినప్పుడు వీడియో గ్రఫీ విషయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు సొంత పార్టీ నేతలకు వచ్చే సరికి ఆ నొప్పి తెలిసిందా అని నిలదీశారు. ఎపి పోలీసులకు ఒక రూల్, సిబిఐకి ఒక రూలా? అని ప్రశ్నించారు. సొంత బాబాయి హత్య కేసులో అవినాష్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందరిలాగే అతన్ని విచారిస్తారే తప్ప ప్రత్యేక విచారణ ఉండదన్న విషయం వైసిపి నేతలు గ్రహించాలని తెలిపారు.

ప్రదర్శన ఆపే ప్రసక్తే లేదు

ముంబయి : నగరంలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్-ఎస్)లో బిబిసి డాక్యుమెంటరీ ప్రదర్శనను ఆపేది లేదని ఆ విద్యాసంస్థకు చెందిన ప్రగతిశీల విద్యార్థి సంఘం తెలిపింది. ఈ విషయంలో 'ఇంచు కూడా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. కాగా, ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం ప్రదర్శనకు అనుమతి లేదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీనికి స్పందనగా ప్రగతిశీల విద్యార్థి సంఘం ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకున్నది. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడికి వ్యతిరేకంగా పోరాడాలని విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది.

కుటుంబ సభ్యులకు అప్పగించిన గిరిజన సంఘం నాయకులు

వెట్టిచాకిరి నుంచి గిరిజన కుటుంబానికి విముక్తి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు (నెల్లూరు జిల్లా)

ఎంతో కాలంగా వెట్టి చాకిరీలో మగ్గిపోతున్న ఓ గిరిజన కుటుంబానికి ఎట్టకేలకు విముక్తి లభించింది. ఈ ఘటనపై చొరవ చూపిన పోలీసులపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలంలోని మల్లికార్జునపురం ఎస్‌టి కాలనీకి చెందిన ఎల్లసిరి మణి తన భార్య మాధవి, ఇద్దరు కుమారులు చైతన్య, రమణలతో కలిసి ఐదేళ్ల కిందట కడప జిల్లా రాయచోటి ప్రాంతంలో ఇటుక బట్టి యజమాని జి.మోహన్‌బాబు నాయుడు వద్ద సిమెంట్ తయారీ పనికి వలస వెళ్లారు. అప్పటి నుంచి మణి ఆయన భార్య మాధవి కుమారులు చైతన్య, రమణతో యజమాని బలవంతంగా వెట్టి చాకిరి చేయిస్తున్నాడు. ఆచాకిరి చేయలేక ఆ పేద గిరిజన కుటుంబం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చింది.

ఆ కుటుంబం రూ. 3 లక్షలు బాకీ చెల్లించాల్సి ఉందని, అది చెల్లించే వరకు పోవడానికి వీల్లేదని వారిని నిర్బంధించాడు. ఈ నేపథ్యంలో మణి ఆరోగ్యం క్షీణించింది. కడుపునొప్పి, అధిక జ్వరం వల్ల ఫిట్స్ వచ్చింది. అయినా ఆయనను ఆస్పత్రికి కూడా తీసుకుపోకుండా నిర్బంధించాడు. దాంతో భార్య, బిడ్డలు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఇటుకబట్టీ యజమాని మణి కుటుంబానికి పెడుతున్న చిత్ర హింసల గురించి తెలుసుకున్న ఎపి యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, నెల్లూరు జిల్లా అధ్యక్షులు డివిఎల్ శేఖర్ తమ సంఘం ప్రతినిధులతో కలిసి విషయాన్ని ఎస్పి విజయరావు దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పి ఆదేశాల మేరకు తోటపల్లిగూడూరు సిఐ వేమారెడ్డి, ఎస్ఐ కె.ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి రాయచోటికి వెళ్లారు. ఇటుక బట్టి యజమాని మోహన్‌బాబు నాయుడు నిర్బంధంలో ఉన్న మణి ఆయన భార్య, బిడ్డలను విడిపించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెట్టి చాకిరి నుంచి తమకు విముక్తి కలిగించిన పోలీసులకు, గిరిజన సంఘం నాయకులకు మణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సమాజ అవసరాలు తీర్చడంలో సహకార బ్యాంకులది ముఖ్య పాత్ర

● ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయ రుణాలు, ఆర్థిక సమ్మేళనంలో సహకార బ్యాంకులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, సమాజ అవసరాలు తీర్చడంలో కో ఆపరేటివ్ బ్యాంక్స్ ముందున్నాయని భారత రిజర్వు భ్యాంకు (ఆర్‌బిఐ) డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు అన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఆప్కాబ్ బ్యాంకర్ల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ సహకార బ్యాంకుల అభివృద్ధికి ఆర్‌బిఐ అన్ని చర్యలు తీసుకుంటోందని, మార్కెట్‌లోని ఇతర వాణిజ్య బ్యాంకులతో పోటీపడేలా సహకార బ్యాంకులను బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. కృష్ణా డిసిసిబి రూ.10 వేల కోట్లు దాటిన నేపథ్యంలో రూపొందించిన బ్రోచర్‌ను నాబార్డు చైర్మన్ షాజీ కెవి రిలీజ్ చేశారు. వాణిజ్య బ్యాంకులు, ఆర్ఆర్‌బిఎస్, సహకార బ్యాంకులు ప్రజలకు సేవలందిస్తూ నిజమైన బ్యాంకర్లుగా పని చేస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఎపి స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ మూడు రెట్ల అభివృద్ధి సాధించిందని, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు రుణాలు ఇవ్వడంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. రెండు గ్రామాలకు ఒక పిఎసిఎస్ పథకాన్ని ప్రారంభించడం ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయడంతో పాటు సహకార సంఘాల సంఖ్యను కూడా పెంచుతామని నాబార్డు చైర్మన్ తెలిపారు. ఫిషరీష్, పశుపోషణ, అనుబంధ కార్యకలాపాలు వంటి వైవిధ్యమైన రుణాల కార్యకలాపాలపై దృష్టి సారించాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపి వి బాలశౌరి, వ్యవసాయ మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఎన్ఎఫ్ఎస్‌సిఓబి డైరెక్టర్, ఆఫ్కాబ్ చైర్మన్ మల్లెల జాన్సీరాణి, రిజిస్ట్రార్ కో ఆపరేటివ్ సొసైటీస్ బాబు ఎ, నాబార్డు సిజిఎం ఎంఆర్ గోపాల్, ఆఫ్కాబ్ ఎండి డాక్టర్ ఆర్ఎస్‌రెడ్డి ఎస్ఎల్‌బిసి కన్వీనరు నవనీత్‌కుమార్, ఎండి ఆర్ శ్రీనాథ్‌రెడ్డి హాజరయ్యారు.

బీమా కంపెనీకి ఎదురుదెబ్బ

● ప్రమాద బాధిత కుటుంబానికి పరిహారం పెంపు

ప్రజాశక్తి, అమరావతి

ఒక కేసులో ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును రోడ్డు ప్రమాద బాధిత కుటుంబం సవాల్ చేయకపోయినప్పటికీ బీమా కంపెనీ దాఖలు చేసిన అప్పీల్‌లో పరిహారంపై ప్రయోజనం పొందింది. రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.1.79 లక్షలను పరిహారం చెల్లించాలని ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. దీనిని బీమా కంపెనీ హైకోర్టులో సవాల్ చేయగా, ఆ కుటుంబానికి పరిహారాన్ని రూ.5.89 లక్షలకు పెంచింది. ఇప్పటికే రూ.1.79 లక్షలు చెల్లించినందున మిగిలిన రూ.4.10 లక్షలను బాధిత కుటుంబానికి చెల్లించాలంది. బాధిత కుటుంబం అప్పీల్ చేయనప్పటికీ అప్పీల్‌లో ఈ విధమైన తీర్పు ఇచ్చే పరిధి తమకు ఉందని జస్టిస్ డి.వెంకట రమణ ఇటీవల తీర్పు చెప్పారు.

అమరావతికి చెందిన లలూ నాయక్‌ను అతి వేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో 2005లో చనిపోయాడు. రూ.2 లక్షలు పరిహారం కావాలని బాధిత కుటుంబ ప్రమాద బీమా ట్రిబ్యునల్‌లో కేసు వేస్తే, రూ.1.79 లక్షలుగా పరిహారం ఇవ్వాలని 2007లో తీర్పు చెప్పింది. ఈతీర్పును నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, గుంటూరు డివిజనల్ మేనేజర్ సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. మతుడి ఆదాయం రూ.1200గా నిర్ణయించడం అన్యాయమని, రూ.4500లని బాధిత కుటుంబం వాదన. ట్రిబ్యునల్ తీర్పును బాధిత కుటుంబం అప్పీల్ దాఖలు చేయనందున పరిహారం పెంపు చెల్లదని బీమా కంపెనీ వాదనను కొట్టేసింది.

పత్రికా స్వేచ్ఛకు ప్రమాదం

● ఐటి చట్ట సవరణలపై ఎన్ఎజె, డియుజె జర్నలిస్టు సంఘాల ఆందోళన

● బిబిసి డాక్యుమెంటరీ ప్రదర్శన విషయంలో విద్యార్థులపై 'దాడి'కి ఖండన

న్యూఢిల్లీ : ఐటీ నిబంధనలు, 2021కు కేంద్రం తీసుకొచ్చిన సవరణల ముసాయిదాపై జర్నలిస్టు సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మోడీ సర్కారు నిర్ణయంపై ఇప్పటికే పలు జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టు ప్రముఖులు, సామాజికవేత్తలు, నిపుణులు ఆందోళనను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే జాబితాలో మరో రెండు జర్నలిస్టు సంఘాలు చేరాయి. ది నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె), ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (డియుజె) ఈ సవరణల ముసాయిదాను తప్పుబట్టాయి. అలాగే, 2002 గుజరాత్ అల్లర్ల విషయంలో మోడీ పాత్రపై బీబీసీ డాక్యుమెంటరీ లభ్యతను, ప్రదర్శనను నిరోధించడానికి కేంద్రం ఎమర్జెన్సీ అధికారాలను ప్రయోగించడాన్ని విమర్శించాయి. ఎమర్జెన్సీ కాలంలో మీడియాను అణచివేసిన విధంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) అనేది " పోలీస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో" గా కాకుడదని డియుజె అధ్యక్షులు ఎస్.కె.పాండే, డియుజె జనరల్ సెక్రెటరీ సుజాత మధోక్, ఎన్ఎజె సెక్రెటరీ జనరల్ ఎ. కొండయ్య, ఎపిడబ్ల్యూజెఎఫ్ జనరల్ సెక్రెటరీ జి. ఆంజనేయులు నొక్కి చెప్పారు. ప్రభుత్వ వార్తలను మీడియాకు అందించే పాత్రను పీఐబీ కొనసాగిచాలని వారు తెలిపారు. ప్రభుత్వానికి అసౌకర్యంగా ఉండే ఏదైనా 'నకిలీ వార్తలు' గుర్తించడానికి, మీడియాను సెన్సార్ చేసే పర్యవేక్షణ బాధ్యతను దీనికి అప్పగించకూడదని అన్నారు. పీఐబీ తన పాత కీర్తిని త్యజించడమనేది విచారించదగిన విషయమని డీయూజే, ఎన్ఏజే లు ఆందోళనను వ్యక్తం చేశాయి. ఇటీవల ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) వెలువర్చిన ఆందోళనలనే డీయూజే, ఎన్ఏజే లు వెల్లడించాయి. బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనల విషయంలో విద్యార్థుల, విద్యార్థి సంఘాలపై పెరుగుతున్న దాడులపై ఈ రెండు జర్నలిస్టు సంఘాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. పత్రికా స్వేచ్ఛ, హక్కులపై జరుగుతున్న దాడులలో భాగమని తెలిపాయి.

పత్రికా స్వేచ్ఛ ముఖ్యం : భారత్‌కు జర్మనీ పిలుపు

బిబిసి డాక్యుమెంటరీపై మోడీ సర్కారు నిర్ణయం భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయంగానూ విమర్శలను ఎదుర్కొంటున్నది.పత్రికా మరియు భావ ప్రకటనా స్వేచ్ఛ ముఖ్యమని జర్మనీ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ లను కల్పిస్తోందని, భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛ విలువలను జర్మనీ పంచుకుంటుందని తెలిపారు.

ప్రమాదంలో ప్రజల సొమ్ము

(మొదటి పేజీ తరువాయి)

కరిగి పోనున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మ్యూచువల్ ఫండ్లు.. అప్పులు

2022 డిసెంబర్ ముగింపు నాటికి దేశంలోని అన్ని మ్యూచువల్ ఫండ్ కంపెనీలు అదానీ కంపెనీల్లో స్థూలంగా రూ.25,263 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. ఐసిఐసిఐ, యాక్సిస్, హెచ్‌డిఎఫ్‌సి, క్వాంట్. టాటా, యుటిఐ తదితర మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఈ మొత్తాన్ని పెట్టుబడులుగా పెట్టాయి. అదానీ గ్రూపులోని ఐదు కంపెనీలకు భారత బ్యాంక్‌లు రూ.81,200 కోట్ల అప్పులు ఇచ్చాయి. మిగితా ఐదు లిస్టెడ్, ఇతర అనుబంధ కంపెనీలకు ఇచ్చిన అప్పుల లెక్కలేదు. 2021-22 ముగింపునకు ముందు మూడేళ్లలో అదానీ అప్పులు రెట్టింపై రూ.1 లక్ష కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్లకు చేరాయి. బ్యాంక్‌లు ఇచ్చిన అప్పుల్లో 25 శాతం పెరుగుదల ఉంది. అదానీ గ్రూపు మొత్తం అప్పుల్లో ఒక్క స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుండే 40 శాతం ఉన్నాయని సమాచారం. అదానీ గ్రూపు కంపెనీల మోసాలపై వస్తున్న ఆరోపణలు రుజువు అయితే.. భవిష్యత్తుల్లో అదానీ సామ్రాజ్యం మునిగిపోతే భారత బ్యాంకింగ్ వ్యవస్థ తీవ్ర అగాథంలోకి పడిపోనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సెబీ దృష్టి..

అదానీ గ్రూపునపై హిండెన్‌బర్గ్ విడుదల చేసిన రిపోర్టుపై సెబీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దశాబ్దాలుగా అదానీ కంపెనీలు అకౌంటింగ్ మోసాలకు, షేర్ల ధరల పెరుగుదలలో అవకతవకలకు పాల్పడుతుందని హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్టుపై సెబీ నిశితంగా పరిశీలన చేస్తోందని వార్తలు వస్తున్నాయి.

విశాఖపై పంజా!

(మొదటి పేజీ తరువాయి)

కూడా తనపరం చేసుకోవడానికి సన్నాగాలు పన్నుతున్నారు.

వైజాగ్ పోర్టులో అదానీ 'కార్పొరేట్' మోసం

విశాఖ పోర్టులో అదానీ కార్పొరేట్ మోసానికి తెర తీశారు. 2013లో విశాఖ పోర్టులోని ఇక్యూ-1 బెర్తును 30 ఏళ్లపాటు లీజుకు తీసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత ఈ బెర్తు పోర్టుపరం అవుతుంది.

ఒప్పందం ప్రకారం ఏటా 1.3 మిలియన్ టన్నుల కార్గో రవాణా చేయాలి. తర్వాదా వచ్చే ఆదాయంలో 40 శాతం వాటాను పోర్టుకు ఇవ్వాలి. బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బిఒటి)కి అంగీకరించాడు. స్టీమ్ కోల్ మాత్రమే ఈ బెర్తుపై చేయాలన్నది నిబంధన.

విదేశాల నుంచి దిగుమతి, రవాణా చేయాలని ఒప్పందం. 2015 వరకూ నిర్మాణం చేసి బెర్తును సిద్ధం చేశాడు. కేంద్ర ప్రభుత్వ విధానంలో భాగంగా స్టీమ్ కోల్ విదేశాల నుంచి దిగుమతి లేదనగానే ఈ బెర్తులో 2016 నుంచి ఎలాంటి వ్యాపారమూ చేయకుండా నిబంధనలకు ఉల్లంఘించారు. తాను రూ.400 కోట్లు ఖర్చు పెట్టానని (వాస్తవ ఖర్చు రూ.230 కోట్లే,) అదంతా ఇవ్వాలని వైజాగ్ పోర్టుపై ఒత్తిడి పెంచారు. వ్యాపారం లేక పోర్టు ఇప్పటికే నష్టపోయిందని, రీపే చేయబోమని పోర్టు యాజమాన్యం తెగేసి చెప్పింది. ఆర్బిట్రేషన్‌కు వెళ్లింది. పోర్టు తక్కువ నష్టంతో బయటపడింది. లేదంటే నిండా మునిగిపోయేది.

గంగవరం పోర్టును దోచుకున్న తీరు ఇలా...

అతిపెద్ద నాన్-మేజర్ పోర్టుల్లో ఒకటైన గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వం 10.39 శాతం వాటా కలిగి ఉండేది. ఈ పోర్టు ప్రస్తుతం గంగవరం పోర్టు లిమిటెడ్ (పిజిఎల్) తొమ్మిది బెర్తులను నిర్వహిస్తోంది. భవిష్యత్తులో ఈ బెర్తుల సంఖ్య 31కి, ప్రస్తుతంగల వార్షిక కార్గో సామర్థ్యం 6.4 కోట్ల టన్నులను 25 కోట్ల టన్నులకు పెంచే జిపిఎల్ మాస్టర్ ప్లాన్ కల నెరవేరలేదు. ఈ పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న సుమారు 1400 ఎకరాల భూములతోపాటు పోర్టు మొత్తం అదానీ వశమైంది. ఇక్కడ ఎకరా రూ.10 కోట్లు అనుకున్నా రూ.1.80 లక్షల కోట్ల మేర రాష్ట్ర ఖజానాకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ చర్యతో నష్టం వాటిల్లింది. రూ.5 వేల కోట్లకే కట్టబెట్టింది. మరో 1450 ఎకరాలను లీజుకు ఇచ్చింది. దీనినిబట్టి లోపాయికారిగా భారీ 'డీల్' జరిగిందని స్పష్టమైంది. రాష్ట్రంలోని కృష్ణపట్నం పోర్టును కూడా అదానీకి ప్రభుత్వం కట్టబెట్టింది.

హైడ్రో పవర్ ప్రాజెక్టుతో అదానీకి దాసోహం

విశాఖ ఉమ్మడి జిల్లా చింతపల్లి మండలం ఎర్రవరం పెదకోట వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గిరిజన చట్టాలన్నిటినీ ఉల్లంఘించి మరీ కేంద్రం ఆమోదంతో రాష్ట్ర ప్రభుత్వం అదానీ జాయింట్ వెంచర్‌తో ఎంఒయులు చేసుకుంది. పీసా, షెడ్యూల్డ్ ప్రాంతాలు , ఇతర అటవీ ప్రాంతాలకు వర్తించే ఎఫ్ఆర్ఎ చట్టాల కింద ఆదివాసీ గ్రామసభలను నిర్వహించకుండానే అదానీకి దాసోహం అన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ హైడ్రోప్రాజెక్టు విషయంలో రాయితీలను అదానీకి ఫలహారంగా ఇచ్చింది.

మధురవాడలో రూ.4 వేల కోట్ల విలువైన 130 ఎకరాలు...

విశాఖ నగర పరిధిలోని మధురవాడ ప్రాంతంలో సర్వే నెంబర్ 409లో 130 ఎకరాల్లో అదానీ గ్రూపు డేటా అనలటిక్స్ సెంటర్ కోసం ఏర్పాట్లు చేసింది. నాలుగు వేల కోట్ల రూపాయల విలువైన ఈ భూమిని అదానీకి రూ.130 కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టింది. విశాఖ రాష్ట్ర పరిపాలనా రాజధానిగా మారితే ఈ ప్రాంతంలో గజం రూ.కోటి పలికే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి చోట ముందస్తుగానే అదానీకి చాప పరిచింది జగన్ సర్కారు. టిడిపి హయాంలోనూ అదానీకి వేల ఎకరాలివ్వగా, జగన్ అదే బాటలో నడుస్తున్నారు. షేర్ మార్కెట్ మోసాలే కాదు ఆదానీ కాలు మోపిన చోటల్లా ప్రజా వనరులను భారీ ఎత్తున లూటీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో అదానీ వ్యవహారాలపై విచారణల ద్వారా నిజాలు నిగ్గుతేల్చాలన్న ప్రజా డిమాండ్ నానాటికీ పెరుగుతోంది.

లోకేష్ పాదయాత్ర వల్ల ఒరిగేదేమీ లేదు

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నారా లోకేష్ పాదయాత్ర వల్ల టిడిపి సాధించేదీ ఏమీ ఉండదని, వైసిపికి వచ్చే నష్టం ఏమీ లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సరుకు లేని లోకేష్ పాదయాత్ర చేసి ఏం ప్రయోజనం? అది యువ గళమో.. గరళమో త్వరలోనే తెలుస్తుందన్నారు. గొడ్డొచ్చిన వేళ, బిడ్డ వచ్చిన వేళ.. అన్నట్టు లోకేష్ రాకతో టిడిపి పతనం ఖాయం అన్నారు. చంద్రబాబు, లోకేష్ ఎక్కడ అడుగుపెడితే అక్కడ ఎదో ఒక ఉపద్రవం వస్తుందని పరోక్షంగా తారకరత్న అస్వస్థత అంశాన్ని ప్రస్తావించారు. పోలీసులపై అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు టిడిపి పతనానికి నాంది అని అన్నారు. నాయకుడు అనే వాడికి కొన్ని లక్షణాలు ఉండాలని, అవేవీ లోకేష్‌కు లేవని విమర్శించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఇద్దరు బఫూన్‌లు తయారయ్యారని ఆరోపించారు. ఒకరు చంద్రబాబు పుత్రుడు, మరొకరు చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. ఒకాయన పాదయాత్రతో వచ్చినా.. మరొకరు వారాహి మీద వచ్చినా అంతా హాస్యమేనని పేర్కొన్నారు.

అనుచితంగా మాట్లాడారు

- అచ్చెన్నాయుడి వ్యాఖ్యలపై ఎస్‌పి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

యువగళం పాదయాత్ర ప్రారంభ సందర్భంగా పోలీసులను ఉద్దేశించి టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేశారని చిత్తూరు జిల్లా ఎస్‌పి రిశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో అచ్చెన్నాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీసులను రెచ్చగొట్టేలా, వారి మానసిక స్థైర్యం దెబ్బతీసేలా అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒక పార్టీ అధ్యక్షుని హోదాలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడడం అనుచితమని తెలిపారు.

పోలీసు అధికారుల సంఘం ఖండన

పోలీసులను, ఉద్యోగులను కించపరిచేలా రాజకీయ నాయకులు మాట్లాడడం సరికాదని పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఉదయ్‌కుమార్ అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అచ్చెన్నాయుడు వ్యాఖ్యలను పోలీసు విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు మురళీ ఖండించారు.

హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

- అవకాశవాద పార్టీలను యువత ప్రశ్నించాలి
- ఒంగోలు, బాపట్ల, గుంటూరులో ప్రత్యేక హోదా సమరయాత్రకు ఘనస్వాగతం

గుంటూరులో ర్యాలీలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, విభజన హామీల కోసం విద్యార్థులు పోరాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన 'ప్రత్యేక హోదా సాధన సమరయాత్ర 2.0' శనివారం ఒంగోలు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో పర్యటించింది. ఆయా జిల్లాల్లో యాత్రకు సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ర్యాలీలు నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడారు. ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా రాష్ట్రాన్ని బిజెపి దగా చేస్తోందన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి విద్యార్థులు, యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలు వస్తాయని, యువత సొంతంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశాలు ఏర్పడతాయన్నారు. అవకాశవాద రాజకీయ పార్టీలను ప్రశ్నించాలని విద్యార్థులకు సూచించారు. మోడీ రాష్ట్రానికి చేసిన ద్రోహం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 25 సీట్లు ఇస్తే హోదా తెస్తానన్న జగన్ ఢిల్లీ వెళ్లి మోడీ ముందు మెడలు వంచుతున్నారని, చంద్రబాబు కూడా హోదాపై నోరు మెదపడం లేదని విమర్శించారు. బిజెపి విషకౌగిలి నుంచి పవన్ కల్యాణ్ బయటకు వచ్చి హోదా కోసం పోరాడాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, జాన్సన్‌బాబు మాట్లాడుతూ.. కేంద్రం చేస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వం మద్దతునిస్తోందని పేర్కొన్నారు.

గుంటూరులో స్థానిక పాతబస్టాండ్ సెంటర్ నుండి ఎసి కళాశాల వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏసీ కాలేజీలో నిర్వహించిన సభలో చలసాని శ్రీనివాస్, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, రామన్న ప్రసంగించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది నిరుద్యోగులున్నారని, ప్రతి ఏటా లక్షల మంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేస్తున్నారన్నారు. వారందరికీ ఉద్యోగావకాశాలు రావాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమన్నారు. హోదా వస్తే పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. రాష్ట్ర యాత్ర బృందంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్‌బాబు, రాజేంద్ర, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, అల్లూరి సీతారామరాజు మేనల్లుడు నరసింహారాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో భగ్గుమన్న విభేదాలు

- ఎంపి, ఎమ్మెల్యే అనుచరుల బాహాబాహీ
- నాగాయలంకలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, నాగాయలంక

కృష్ణా జిల్లాలో వైసిపి ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. కృష్ణా జిల్లా నాగాయలంకలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అనుచరులు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. చెప్పులతో కొట్టుకున్నారు. ఎంపి, ఎమ్మెల్యే సాక్షిగా జరిగిన ఈ ఘటనలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించాల్సి వచ్చింది. దీంతో నాగాయలంకలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. నాగాయలంక మండలం రేమాలవారిపాలెం పంచాయతీలోని మార్కెట్ యార్డు ఆవరణలో నాబార్డు చైర్మన్ కె.వి.షాజీ ఆధ్వర్యాన మత్స్య, డ్వాక్రా సంఘాల సభ్యులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపి బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎంపి, ఎమ్మెల్యే అనుచరుల మధ్య ఏర్పడిన చిన్న వాగ్వాదం కొట్లాటకు దారితీసింది. ఇరు గ్రూపుల వారు పరస్పరం తోసుకుంటూ చెప్పులతో కొట్టుకున్నారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఓ దశలో ఎమ్మెల్యే సింహాద్రిపై ఎంపి అనుచరులు దాడికి ప్రయత్నించడంతో ఉద్రిక్తత తీవ్రస్థాయికి చేరింది. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న ఓ జర్నలిస్టు మొబైల్‌ఫోన్‌ను ఎమ్మెల్యే అనుచరులు లాక్కుని ధ్వంసం చేశారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవనిగడ్డ పర్యటనకు వచ్చిన సందర్భంలో ఎంపి, ఎమ్మెల్యే అనుచరుల మధ్య ఫ్లెక్సీల వివాదం ఏర్పడింది. దీనిని మనసులో ఉంచుకున్న ఇరుగ్రూపుల వారు మళ్లీ నాగాయలంక వేదికగా బాహాబాహీకి దిగారు. ఈ సంఘటనపై ఎమ్మెల్యే సింహాద్రి స్పందిస్తూ... ఎంపి బాలశౌరికీ, తనకూ మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఇద్దరం కలిసి పనిచేస్తునామని తెలిపారు. ఎంపి బాలశౌరి వెంట వచ్చిన గరికిపాటి శివ కారణంగా తోపులాట జరిగిందన్నారు. కార్యకర్తలకు చెప్పి తోపులాట సద్దుమణిగేలా చేశామని తెలిపారు.

ఫిబ్రవరి 3, 4 వారాల్లో అసెంబ్లీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి మూడు, నాలుగో వారాల్లో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్ జారీ చేసింది. బడ్జెట్ సమావేశాలకు సన్నద్ధం కావాలని అన్ని శాఖలకు సాధారణ పరిపాలన శాఖ ఆదేశించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు, ఇతర శాసనసభా వ్యవహారాల్లో వివరాలు అందించేందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ఈ సర్క్యులర్‌లో పేర్కొంది. శాసనసభ, శాసనమండలికి వేర్వేరుగా నోడల్ అధికారులను నియమించాలని అన్ని శాఖలకు తెలియచేసింది. నోడల్ అధికారుల ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడిలను కూడా ఇవ్వాలని జిఎడి కోరింది.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

- డిప్యూటీ కలెక్టర్ హామీతో విరమణ

ప్రజాశక్తి - భోగాపురం (విజయనగరం)

ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని పోలిపల్లి, లింగాలవలస రైతులు శనివారం పోలిపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని ఆర్‌బికె కేంద్రాలకు తరలిస్తే వాటిని కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. పోలిపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు పదివేల టన్నుల ధాన్యం నిల్వలు ఉండిపోయాయని తెలిపారు. రోజూ ట్రాక్టర్లతో ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రం వద్దకు తెచ్చి మళ్లీ వెనక్కి తీసుకువెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు చేయకుండానే టార్గెట్‌లు పూర్తి అయ్యాయని ఆర్‌బికె అధికారులు చెప్పడం దారుణమన్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు. జగనన్న గృహాలను పరిశీలించేందుకు వెళ్లిన డిప్యూటీ కలెక్టర్ పద్మావతి రైతుల ధర్నా విషయాన్ని తెలుసుకుని పోలిపల్లి ఆర్‌బికెకు చేరుకున్నారు. రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు విషయమై ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నామని, రెండు రోజుల్లో సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని డిప్యూటీ కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో పోలిపల్లి, లింగాలవలస రైతులు పాల్గొన్నారు.

ఎస్‌పిల అనుమతి తీసుకోవాలి

- పాదయాత్రలు, సభలపై డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాజకీయ నాయకులు చేపట్టే పాదయాత్రలకు ఎటువంటి అడ్డంకులూ లేవని, అయితే పాదయాత్రలు, రాజకీయ సభలు నిర్వహించేవారు ఆయా జిల్లాల ఎస్‌పిల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జిఒ నం-1 విడుదల చేశాక ఎక్కడా ఏ రాజకీయ సభను ఆపలేదన్నారు. దానిపై ఎటువంటి ఆందోళన అవసరం లేదని చెప్పారు. సభలు, సమావేశాలు నిర్వహించే రాజకీయ నాయకులు ఆ నియోజకవర్గ పరిస్థితిని బట్టి జిల్లా ఎస్‌పి అనుమతి తీసుకోవాలన్నారు. అదే సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా కొన్ని షరతులు పెట్టి అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. గత 25 సంవత్సరాల నుంచి రాష్ట్రంలో గంజాయి సాగవుతోందన్నారు. అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరు, ఏజెన్సీ ప్రాంతాల్లో 7500 ఎకరాల్లోని గంజాయిని ధ్వంసం చేశామని చెప్పారు. ప్రత్యామ్నాయ పంటలు వేసేలా గిరిజనులకు అవగాహన కల్పించామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని చెప్పారు. పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా సాగాయన్నారు. ఇదే తరహాలో త్వరలో ఎస్‌ఐ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడతామని చెప్పారు. పోలీసు సిబ్బందిలో కొందరికి టిఎ, డిఎ బకాయిలు ఉన్నాయని, వాటిని త్వరలో చెల్లించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజి పాలరాజు, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లిస్తే ఉద్యమం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని, బిజెపిజాతీయ ప్రధాన కార్యదర్శి శంబునాధ్ తొండియా పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఎస్‌సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో ఎస్‌సిల సమస్యలపై విజయవాడలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.. ఈ సమావేశంలో ఎస్‌సి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ పాల్గొన్నారు.

గుడ్లు తేలేస్తున్న రైతులు

- దళారుల మాయాజాలంతో భారీ నష్టం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

దళారుల మాయాజాలంతో పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. నిలకడలేని ధరలు, పెరిగిన పెట్టుబడితో పౌల్ట్రీ రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్‌ను సాకుగా చూపించి ధరలు తగ్గించి దళారులు చక్రం తిప్పుతున్నారు. గత నెలలో రైతుల నుంచి గుడ్డుకు దళారులు రూ.5.39కు కొనుగోలు చేశారు. బహిరంగ మార్కెట్లో రూ.6కు అమ్ముకొనే వారు. ప్రస్తుతం రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన గుడ్డు పేపరు రేట్ 4.90 ఉంది. అయితే, దళారులు వారి నుంచి రూ.4.50కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే కొనుగోలుకు ముఖం చాటేస్తున్నారు. పచ్చి వ్యాపారం కావడంతో వారు అడిగిన ధరకే గుడ్లను రైతులు విక్రయించాల్సి వస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో గుడ్డు ధర రూ.6.50 నుంచి రూ7 వరకూ ఉంది. రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మండపేట, బిక్కవోలు, అనపర్తి తదితర మండలాల్లో సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. వాటిద్వారా 1.05 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరుగుతోంది. ప్రత్యక్షంగా 20 వేలమంది, పరోక్షంగా మరో 20 వేల మంది మొత్తం 40 వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమకు అనుబంధంగా లారీ పరిశ్రమకు ఉపాధి లభిస్తోంది. రైతుల వద్ద కొనుగోలు చేసిన గుడ్లను ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు లారీల ద్వారా దళారులు ఎగుమతి చేస్తున్నారు.

గుడ్డు ఉత్పత్తి ఖర్చు రూ.6

కోళ్ల మేత, దాణా ఖర్చులు ఇటీవల పెరిగిపోయాయి. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50 వేల నుంచి రూ.80 వేలకు పెరిగాయి. దీంతో, దాణా ఖర్చు ఈ మేరకు పెరిగింది. కరోనాకు ముందు దాణా ధర తక్కువగా ఉండడంతో ఖర్చు తగ్గి రైతులు లాభాలు పొందారు. కరోనా అనంతరం దాణా, ఇతర ఖర్చులు భారీగా పెరగడంతో నష్టాలు చవిచూస్తున్నారు. పశ్చిమబెంగాల్, యుపి తదితర రాష్ట్రాల ఎగుమతులపైనే ధరలు ఆధారపడి ఉంటున్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

గుడ్డు ఉత్పత్తి ఖర్చు రూ.6 అవుతోంది. దీనికి రవాణా ఖర్చులు అదనం. గుడ్డుకు రూ.6.50 చెల్లిస్తేనే గిట్టుబాటు. లేదంటే నష్టమే. బహిరంగ మార్కెట్లో ధరలు ఉన్నా రైతులకు ఆశాజనక పరిస్థితులు లేవు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగానికి ఇచ్చినట్లుగానే రైతులు నిర్వహిస్తోన్న పౌల్ట్రీలకు విద్యుత్తు సబ్సిడీ సౌకర్యం కల్పించాలి. కోళ్ల పరిశ్రమను వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా గుర్తించాలి. విద్యుత్తు సంస్థ నుంచి రాయితీ అమలు చేస్తే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదా అవుతుంది. దీనివల్ల కొంత ఊరట లభించే అవకాశం ఉంది. మేత, దాణాలు సబ్సిడీ ధరపై అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- పడాల సుబ్బారెడ్డి, రైతు, మండపేట

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఉద్యోగుల సమస్యలపై 5న ఉద్యమ కార్యాచరణ

- సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలి : బొప్పరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 5న కర్నూలులో జరగనున్న అమరావతి జెఎసి నాలుగో మహాసభలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఎపి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీకాకుళంలోని రెవెన్యూ అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమం, సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని తెలిపారు. సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల వయోపరిమితి పెంపు, ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని చెప్పారు. ఉద్యోగుల హెల్త్ కార్డును ఆస్పత్రులు తిరస్కరిస్తున్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఉద్యోగులు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభ అనంతరం సిఎస్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలపై లేఖ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రభుత్వానికి ఉద్యోగులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి కోవిడ్ విధులు నిర్వహించారని గుర్తు చేశారు. సంఘాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నా ఒకే వేదికపైకి వచ్చి ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

బోయలను ఎస్‌టిలో చేర్చాలి

- 'అనంత'లో పర్యటించిన ఏకసభ్య కమిషన్‌కు వినతులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చే అంశంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ బృందం ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం పర్యటించింది. ఐ.ఆనంద్ శామ్యూల్ కుమార్ నేతృత్వంలో అనంతపురం కలెక్టరేట్, పెనుగొండ సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో అధ్యయన కమిటీ సమావేశం నిర్వహించి బోయలు, గిరిజనుల నుంచి వినతులను స్వీకరించారు. అనంతపురం ఎంపి తలారి రంగయ్యతో కలిసి సంబంధిత వర్గాల అభిప్రాయాలు, ప్రతిపాదనలను స్వీకరించారు. బోయ, వాల్మీకి సంఘాల నేతలు, గిరిజన సంఘాల నేతలు ఈ కార్యక్రమానికి హాజరై వారి అభిప్రాయాలు తెలియజేశారు. బిసి(ఎ) జాబితాలో ఉండటం వల్ల సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడుతున్నామని బోయలు ఆవేదన వ్యక్తం చేశారు. బోయలను ఎస్‌టిల్లో చేర్చాలని వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సాధికార, సంక్షేమ అధికారి ఖుష్బూ కొఠారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అన్నాదొర పాల్గొన్నారు.

బిఎండబ్ల్యు ఎక్స్‌1 విడుదల

- ధర రూ.45.90 లక్షలు

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు శనివారం భారత మార్కెట్లోకి కొత్త బిఎండబ్ల్యు ఎక్స్1 స్పోర్ట్స్ ఆక్టివిటీ వెహికల్ (ఎస్‌ఎవి)ని విడుదల చేసింది. పెట్రోల్, డీజిల్ వర్షన్లలో ఇది లభ్యమవుతుందని ఆ కంపెనీ వెల్లడించింది. పెట్రోల్ వేరియంట్ ధరను రూ.45.90 లక్షలుగా, డీజిల్ వేరియంట్ ధరను రూ.47.90 లక్షలుగా నిర్ణయించింది. వీటిని బిఎండబ్ల్యు గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పవ్వా ఆవిష్కరించారు. ఈ రెండు వాహనాలను కూడా చెన్నయ్ ప్లాంట్‌లో తయారు చేశామన్నారు.

కొత్త వ్యాపారాల్లోకి పిజిఐఎం

ముంబయి : తాము రెండు కొత్త వ్యాపారాలను ప్రారంభిస్తున్నట్లు మ్యూచువల్ ఫండ్ కంపెనీ పిజిఐఎం ఇండియా తెలిపింది. అంతర్జాతీయ, ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్లను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ప్రూడెన్షియల్ ఫైనాన్షియల్‌కు చెందిన అంతర్జాతీయ పెట్టుబడి నిర్వహణ వ్యాపారమైన పిజిఐఎం కొత్త వ్యాపారాల కోసం భారతీయ అనుబంధ సంస్థకు అదనపు దీర్ఘకాలిక పెట్టుబడి సమకూర్చడానికి అంగీకరించినట్లు పేర్కొంది. నియంత్రణ ఆమోదాలకు లోబడి 2023 ఏప్రిల్ 1న రెండు కొత్త వ్యాపారాల ప్రారంభించనున్నామని పిజిఐఎం ఇన్వెస్ట్‌మెంట్స్ ఆసియా వైస్ ఛైర్మన్ డేవిడ్ ఛాంగ్ తెలిపారు. "భారతదేశంలోని అధిక నికర విలువ, రిటైల్ మార్కెట్లలో సంపద ఉత్పత్తి. దేశంలో ఆఫ్‌షోర్ పెట్టుబడుల ద్వారా పెరుగుతున్న అవకాశాలను మేము గమనిస్తున్నాం. గత కొద్ది సంవత్సరాల్లో పిజిఐఎం ఇండియా గణనీయమైన వద్ధిని సాధించింది. అనుభవ సంపద, నిరూపితమైన మా స్థానిక నాయకత్వం పనితీరు మరియు పెట్టుబడి నైపుణ్యాలు తదుపరి దశ వృద్ధిపై మాకు అపారమైన విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి" అని డేవిడ్ ఛాంగ్ పేర్కొన్నారు. "మా మ్యూచువల్ ఫండ్ క్లయింట్ల అత్యద్భుతమైన మద్దతుకు మేము ఎంతో సంతోషిస్తున్నాను, ఒక సమర్థవంతమైన పెట్టుబడి బందాన్ని సమకూర్చుకొని, విస్తతమైన కేంద్రీకరణతో కూడిన పిజిఐఎం ఇండియా 2.0ను ప్రారంభించడానికి అది మమ్మల్ని ప్రోత్సహించింది." అని పిజిఐఎం ఇండియా మ్యూచువల్ ఫండ్ సిఇఒ శ్రీనివాసరావు రావూరి పేర్కొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

- తిరుమల, అరసవల్లిలో జన సందోహం

ఆదిత్యునికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి -తిరుమల/ శ్రీకాకుళం ప్రతినిధి

రథసప్తమి వేడుకలు తిరుపతి, శ్రీకాకుళం జిల్లాలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తిరుమలలో సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు సప్తగిరీశుడు సప్తవాహన సేవల్లో దర్శనమిచ్చారు. మూడేళ్ల సుదీర్ఘ కాలం అనంతరం వాహన సేవలను సందర్శకుల సమక్షంలో నిర్వహించడంతో భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళల కోలాటాలు, చక్కబజనలు, వివిధ దేవతామూర్తుల వేషధారణలతో తిరుమాడవీధుల్లో ఆడిపాడారు. తితిదే ఎస్‌వి బాలమందిరం విద్యార్థులు ఆలపించిన ఆదిత్యహృదయం, సూర్యాష్టకం ఆకర్షణగా నిలిచాయి. ఈ ఏడాది తిరువీధుల్లో షెడ్లను ఏర్పాటు చేయడంతో యాత్రికులు ప్రశాంత వాతావరణంలో ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. 1800 మంది శ్రీవారి సేవకులతో నిరంతరాయంగా వివిధ రకాల అన్నప్రసాదాలను, మంచినీరు, మజ్జిగను అందించారు. గ్యాలరీల వద్ద సీనియర్ అధికారులతో నిరంతరం పర్యవేక్షించారు.

శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన క్షీరాభిషేక సేవ శనివారం ఉదయం వరకు కొనసాగింది. దేవాదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్వామివారికి వేర్వేరుగా పట్టు వస్త్రాలు సమర్పించారు. రథసప్తమి వేడుకలను వీక్షించేందుకు అర్ధరాత్రి నుంచే రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు తెలంగాణ, ఒడిశా నుంచి యాత్రికులు భారీగా చేరుకున్నారు. యాత్రికుల తాకిడితో వివిఐపి, విఐపి క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. ఉచిత దర్శనం, 100 రూపాయల టికెట్ క్యూలైన్‌లోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. పిల్లలు, వృద్ధులు గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. ఎండ వేడిమి, గంటల తరబడి క్యూలో నిల్చోడం వల్ల కొందరు వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. ఆదిత్యున్ని దర్శించుకున్నవారిలో పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయకుమార్, విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జిఆర్.రాధిక సతీసమేతంగా దర్శించుకున్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా

హైదరాబాద్ : బ్యాంక్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ప్రకటించిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. జనవరి 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు ఇది వరకు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పనిదినాలు, నూతన పెన్షన్ విధానం రద్దు, వేతన పెంపు సవరణపై చర్చలకు ఆహ్వానించడం, ఖాళీగా ఉన్న విభాగాల్లో నియామకాలు తదితర డిమాండ్లను పరిష్కరానికి సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే తమ నిర్ణయాన్ని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు యుఎఫ్‌బియు తెలిపింది. ఉద్యోగుల డిమాండ్లపై చర్చ నిమిత్తం జనవరి 31న బ్యాంకు యూనియన్లతో సమావేశమయ్యేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) అంగీకరించడంతో సమ్మెను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఎజిఐ గ్రీన్‌ప్యాక్‌కు రూ.53 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ప్యాకేజింగ్ కంపెనీ ఎజిఐ గ్రీన్ ప్యాక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.53.23 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రిత ఏడాది ఇదే క్యూ3లో రూ.29.44 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీనితో పోలిస్తే క్రితం క్యూ3 లాభాల్లో 81 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. కంపెనీ మొత్తం ఆదాయం రూ.396 కోట్ల నుంచి రూ.567 కోట్లకు పెరిగింది. 2022-23 మూడు త్రైమాసికాల్లో రూ.1,061 కోట్ల ఆదాయంతో రూ.153 కోట్ల లాభాలు సాధించినట్లు పేర్కొంది.

మెదడుకు మేత

వందలాది మామిడి పండ్ల మధ్యనున్న చిలుకను గుర్తించగలరా? ఈ తైలవర్ణ చిత్రంలో ఎన్ని ముఖాలు కనిపిస్తున్నాయో చెప్పగలరా? ఈ కొండరాళ్ల మధ్యన చిరుత వుంది. అది ఎక్కడుందో చెప్పగలరా? అంటూ... రకరకాల బొమ్మలు, ఫొటోలు నిత్యం చూస్తూనే వుంటాం. కొందరైతే...ఆదివారం వచ్చిందంటే చాలు... పేపర్‌తో పాటు వచ్చే పుస్తకం తీసుకొని చివరి పేజీలోని పదాలతో కుస్తీ పడుతుంటారు. పజిల్స్ కూడా ఈ కోవలోకే వస్తాయి. పిల్లలు విజ్ఞానం కోసం, పెద్దలు కాలక్షేపం కోసం, వృద్ధులు తమ జ్ఞాపకశక్తికి పదును పెట్టేందుకు ఈ పజిల్స్ ఆడుతుంటారు. ఏకాగ్రతగా వాటిని గమనిస్తూ... వాటిలోని చిక్కుముడి విప్పడానికి ప్రయత్నిస్తారు. చురుకైన చూపు, పదునైన మెదడు వున్నవారిని సైతం ఇలాంటి చిత్రాలు, పజిల్స్ అయోమయానికి గురిచేస్తుంటాయి కూడా. అయినా పట్టువదలని విక్రమార్కుల్లా ప్రయత్నం చేస్తూనే వుంటారు. ఆ చిక్కుముడి వీడగానే వారి పెదవులపై ఒక చిరునవ్వు... వారి మోముపై పున్నమినాటి చంద్రుడు వెలుగొందుతాడు. ఈ ప్రపంచాన్ని జయించినంత ఆనందం వారి కళ్లలో తొణికిస లాడుతుంది. 'అనగ నంగ రాగ మతిశయిల్లుచునుండు/ తినగ తినగ వేము తీయగనుండు/ సాధనమున పనులు సమకూరు ధరలోన' అంటాడు వేమన. నిజానికి ఇలాంటి అనుభూతి చాలామందికి సుపరిచితమే. వయసుతో సంబంధం లేకుండా వీటిని ఇష్టపడుతుంటారు.

అసలు ఈ పజిల్స్ మన జీవితంలోకి ఇప్పుడే కొత్తగా వచ్చినవని కావు. భాష, సాహిత్యంతో పాటు పజిల్స్ కూడా పలు దశల్లో అభివృద్ధి చెందుతూ వచ్చినవే. సమస్యాపూరణం, అవధానంతో పండితులు తమ భాషా కౌశలాన్ని ప్రదర్శిస్తే...సాధారణ ప్రజల్లో పొడుపు కథలు ఆదరణ పొందాయి. ప్రపంచవ్యాప్తంగా తొలి పజిల్స్‌గా చరిత్రకెక్కినవి పొడుపు కథలేనంటారు పెద్దలు. నేడు పద క్రీడగా పేరొందిన పదవినోదం, పదకేళి, పదబంధం, నుడిక్రీడ, గడి-నుడి, పదపూరణం వంటివి పద సంపదను, తద్వారా భాషను మెరుగుపర్చుకోడానికి, సైన్స్ పజిల్స్, సుడొకు, క్రాస్‌వర్డ్ పజిల్, రూబిక్స్ క్యూబ్, జిగ్‌సా, స్లైడింగ్ పజిల్ వంటివి మెదడుకు మేతగా ఉపయోగపడతాయి. పిల్లలకు బొమ్మల రూపంలో కూడా అనేక పజిల్స్ అందుబాటులో వున్నాయి. ఈ పజిల్స్‌లోని చిక్కు ముడిని విప్పగలిగే వారిలో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. మానసిక దృఢత్వానికి, వికాసానికి తోడ్పడతాయి. అంతేకాదు, వీరిలో ఏదైనా సమస్యకు సంబంధించిన మెలకువల సాధనకు అవసరమయ్యే లాజికల్ థింకింగ్ అలవడుతుంది. ఈ క్రమంలో ఏదైనా అంశాన్ని చూసే దృష్టి కూడా మారుతుంది. ఒక అంశాన్ని అన్ని కోణాల్లోనూ విశ్లేషించగల నేర్పు అలవడుతుంది. ఐక్యూ లెవెల్స్, రీజనింగ్ స్కిల్స్ మెరుగవుతాయి. ముఖ్యంగా నిత్యం పజిల్స్ ఆడేవారిలో అల్జీమర్స్ వ్యాధి దరిచేరదంటారు. మెదడు ఆరోగ్యంగా వుంటుంది. ముఖ్యంగా వృద్ధులకు ఈ తరహా గేమ్స్ ఎంతో ఉత్తమం.

'ఖాళీగా వుండే మెదడు దెయ్యాల కార్ఖానా' అంటారు. చిన్నలైనా పెద్దలైనా ఎప్పుడూ చురుకుగా వుండాలంటే... ఎప్పుడూ వారి మెదడుకు పని చెప్పాలి. పజిల్స్ ఛేదించే అలవాటున్నవారికి మతిమరుపు త్వరగా రాదనీ, మెదడు చురుగ్గా మారుతుందని, మానసిక సమస్యలు తగ్గుతాయని అనేక పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. మెదడుకు పనిచెప్పడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నైపుణ్యం పెరుగుతుంది. బీపీ కూడా తగ్గుతుందంటున్నారు వైద్యులు. గజిబిజి జీవన విధానంలో ఒత్తిడికి గురవడం సర్వసాధారణం. దానినుంచి బయటపడేందుకు పజిల్స్ బాగా ఉపయోగపడతాయి. ఒత్తిడి తగ్గడంతో, మెదడు ఉత్తేజం పొందుతుంది. ప్రతిరోజూ 20 నుంచి 25 నిమిషాల పాటు పజిల్స్ ఆడితే ఒత్తిడి నుంచి బయటపడొచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల నుంచి కాస్తయినా బయటపడి, ఇలాంటి పజిల్స్ ఆడేందుకు సమయం కేటాయించడం వల్ల నూతనోత్సాహం పొందుతారు. ఏకాగ్రత మెరుగుపడుతుంది. ఏదైనా ఒక అంశంపై సృజనాత్మకంగా ఆలోచించగల శక్తి లభిస్తుంది. ఈ కారణంతోనే ప్రతి ఏడాది జనవరి 29న 'అంతర్జాతీయ పజిల్స్ దినోత్సవం' జరుపుతున్నారు. ఈ సందర్భంగానైనా మెదడుకు సరైన వ్యాయామాన్ని అందిద్దాం.

గతానికి వర్తమానానికి జరిగే అనంతమైన సంభాషణే చరిత్ర.

ఇ.హెచ్.కార్,
బ్రిటిష్ చరిత్రకారుడు.

'ఫేక్' ఉత్తర్వులతో సోషల్ మీడియాపై కత్తి

ప్రస్తుతం

తెలకపల్లి రవి

ఓడ ఎక్కేవరకూ ఓడ మల్లయ్య అన్న పెద్దమనుషులు ఓడ దిగాక ఏమంటారో ఆ సామెత తెలిసిన తెలుగువాళ్లకు బాగా తెలుసు. ప్రధాని నరేంద్ర మోడి సర్కారు విధానం అచ్చంగా ఆ సామెతకు నకలుగా తయారైంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మూడు పర్యాయాలు ఎన్నికైన మోడీ ప్రధాని అభ్యర్థిగా ప్రచారంలోకి రావడానికి సోషల్ మీడియాను సోపానంగా వాడుకున్నారు. కార్పొరేట్ల సాయంతో వేలాది మంది యువతను నియోగించి అహోరాత్రులు ఆయన ఘనతను హోరెత్తించారు. ఉత్తుత్తి ఫోటోలు సృష్టించారు. పాత చరిత్రను మార్చి కొత్త ఇమేజి తేవడానికి తంటాలు పడ్డారు. ఆఖరుకు నరేంద్రమోడీ బిజెపి కార్యాలయం తుడుస్తున్న ఫోటో, ఛాయ్‌వాలా కథ, చదువుకున్న పట్టాలు ఏవీ నిజమని నిరూపించుకోలేకపోయారు. ఈ పట్టాను గురించిన సమాచారం ఇవ్వవలసిందిగా సంబంధిత సంస్థను ఆదేశించినందుకు తెలుగువాడైన జాతీయ సమాచార హక్కు కమిషనర్ డా॥ మాడభూషి శ్రీధర్‌ను తప్పించారు కూడా. బిజెపి, ఆరెస్సెస్ మార్కు అసత్య కథనాలు కట్టుకథలు తట్టుకోలేక వార్తాసంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసి వచ్చింది. ప్రత్యేక పరిశోధకులను నియమించి నిరూపించవలసి వచ్చింది. ఇదిగో ఈ ఫోటోను మార్ఫింగ్ చేసి కొత్తది తయారు చేశారని లేదంటే అబద్ధాలతో లేని కథ వండివార్చారని సోదాహరణలతో ఎన్నో కథనాలు బయటపెట్టాయి. కొన్నిసార్లు ఈ పరిశోధన తీవ్ర ఇరకాటంలో పెట్టింది. తమ నిజస్వరూపం బయట పెట్టిన వారిపై కక్ష సాధింపులకూ వేధింపులకూ పాల్పడింది. ఆల్ట్ మీడియా అనే సంస్థ ఇందులో విశేషమైన కృషి చేసింది గనక ఆ సంస్థ అధినేతలలో ఒకరైన మహమ్మద్ జుబేర్‌ను జైలుపాలు చేసింది. సరిగ్గా ఇప్పుడు ఆ అనుభవాన్నే మోడీ సర్కారు మరోవైపు నుంచి ప్రయోగించడానికి సిద్ధమైంది. ఫేక్ న్యూస్ ప్రసారం చేస్తే సహించేది లేదని బెదిరించడమే గాక ఏది నిజం ఏది ఫేక్ అని నిర్ధారించే అధికారం తన చేతుల్లోకి తీసుకుంటున్నది. విమర్శనా స్వేచ్ఛకు, వాస్తవాల వెల్లడికి సాధనాలుగా వుండాల్సిన మీడియా, సోషల్ మీడియాలను నియంత్రించేందుకు కొత్త చట్టాలు బిగిస్తున్నది.

ఏమిటీ సవరణ?

సోషల్ మీడియా ఇంతగా విస్తరించక ముందు ఇన్ఫర్మేషన్ చట్టం-2000 పని చేస్తూ వచ్చింది. ఈ చట్టంలో సెక్షన్ 69(1) కింద ఏదైనా సంస్థ లేదా మీడియా ప్లాట్‌ఫారమ్ ప్రకటించిన వార్త దేశానికి హానికరమైనదని, ఉద్రేకాలు పెంచుతుందని భావిస్తే పోలీసులు కేసు పెట్టొచ్చు. మారిన పరిస్థితులలో ఆ చట్టం సరిపోలేదని 2019లో ఫేక్ వార్తల అదుపునకు పిఐబి కమిటీ వేశారు. 2021లో కొత్త సవరణ తీసుకొచ్చారు. వాటి ప్రకారం బనాయించిన అనేక కేసులు సుప్రీం కోర్టు ముందు విచారణలో వున్నాయి. చాలాసార్లు అత్యున్నత న్యాయమూర్తులే వీటిపై విమర్శలు చేశారు, కేంద్రం తన వైఖరి చెప్పాలని తాఖీదులిచ్చారు. కేంద్రం ఆరు నెలల గడువు కోరింది. ఈ కాలంలో ఆ ఆంక్షలు అమలులో వుండవని సుప్రీం ప్రకటించింది. మరోవైపు 2021 సమాచార సాంకేతిక పరిజ్ఞానం నిబంధనల సవరణ ముసాయిదా తీసుకొచ్చింది. దాంతో వ్యూహాత్మకంగా కేంద్రం కొత్త ఎత్తు ఎత్తింది. ఆ ప్రకారం పిఐబి నియమించే ఫేక్‌వార్తల నియంత్రణ కమిటీ లేదా ప్రభుత్వం అందుకోసం నియమించే మరేదైనా కమిటీకి ఏకపక్ష నిషేధ అధికారం కల్పించారు. ఆన్‌లైన్ గేమింగ్‌ను నిరోధించడానికి ఈ చట్టం తెచ్చామని పైకి చెబుతున్నారు గాని నచ్చని అంశాల ప్రచురణలను తొక్కిపట్టడం కోసం అంతకన్నా తీవ్రమైన అంశం జోడించారు. సోషల్ మీడియా వేదికలలో అంటే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి వంటి వాటిలో వచ్చిన వార్తా కథనాలు (కంటెంట్) అవాస్తవమైతే వాటిని తొలగించే అధికారం పిఐబికి వుంటుందని ఆ సవరణలో ప్రతిపాదించారు. వాటిని తీసేయవలసిందిగా ఆదేశిస్తే మధ్యంతర వ్యవస్థలైన అగ్రిగేటర్లు (అంటే వాటిని నిర్వహించే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి సంస్థలు) అమలు చేయవలసి వుంటుంది. బూటకపు కథనాలు తొలగిస్తే మంచిదే కదా అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ అసలు సమస్య అక్కడే ఉత్పన్నమవుతుంది. ఏది నిజమో ఏది బూటకమో నిర్ణయించేది ఎవరు? వాటికి కొలబద్దలేమిటి?



> బడా మీడియా మోడీకి లోబడిపోయిన నేపథ్యంలో సోషల్ మీడియానే ప్రత్యామ్నాయంగా వుంది. దాంట్లో అనేక అవాస్తవాలు, అవాంఛనీయ ధోరణులు నిజమైనా అనేక వాస్తవాలు కూడా వెలుగు చూస్తున్నాయి. పైగా సోషల్ మీడియాలో పౌర చౌరవకూ పాత్రికేయుల స్వతంత్ర పాత్రకూ చోటుంటోంది. తప్పొప్పులు సరిచేయాలంటే మీడియా, సోషల్ మీడియాలో స్వీయ నియంత్రణా వ్యవస్థ ఏర్పాటు కావాలి గాని ...అధికార వర్గాలకు నిషేధాధికారాలు ఇవ్వడం అనర్థదాయకం.

గత అనుభవాలేమిటి?

గతంలో నియమితమైన పిఐబి కమిటీ అనుభవం తీసుకుంటే చాలా దారుణంగా వుంది. అనేకసార్లు ఈ కమిటీ కొన్ని వార్తలు బూటకమని (ఫేక్) ప్రకటించింది. కాని ఈ ప్రకటనలే బూటకమైనాయి. సంఘపరివార్ లేదా ప్రభుత్వం విడుదల చేసే ఫేక్‌లు తేల్చడానికి సోషల్ మీడియాలో కొందరు కృషి చేస్తూ వచ్చారు. ఉదాహరణకు 2020 డిసెంబరులో కేంద్ర నిఘా విభాగం (ఐబి) తరపున విడుదలైన నియామకాలకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్ బూటకమని గొప్పగా ప్రకటించింది. తర్వాత చూస్తే అది అధికారికంగా ఇచ్చిందేనని తేలింది. పిఐబి తన ట్వీట్‌నే తొలగించుకోవాల్సి వచ్చింది. ఇక పరివార్ దుష్ప్రచారాలకు లోటే లేదు. కరోనా సమయంలో ఆర్ణబ్ గోస్వామి వంటి వారు వలస కార్మికులు తరలిపోతున్న ఫోటోను మసీదు బ్యాక్‌గ్రౌండ్‌తో ఇవ్వడం ఎంత కలవరం కలిగించిందో గుర్తుండే వుంటుంది. కరోనా కాలంలో ఢిల్లీలోని తబ్లిగీ జమాయత్ మర్కజ్ సంస్థలో ఏం జరిగింది? ఈ విషయంలో అప్పట్లో ప్రధానితో సహా చేసిన ప్రకటనలు ఎలా వున్నాయి? మతాల మధ్య చిచ్చు పెట్టడానికి తప్పుడు కథనాలు వదలడంపై చివరకు సుప్రీం కోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. హత్రాస్ ఘటన లోనూ బూటకపు చిత్రాలు వచ్చాయి. నిజమైన ఫోటోలు మార్ఫింగ్ ఫోటోలు పక్కపక్కనే చాలాసార్లు ప్రచురితమైనాయి (ఇలాంటి దారుణమైన అనుభవాలు తెలుగు రాష్ట్రాలలోనూ వున్నాయి. వాటిలోకి వెళితే ఎవరు ఏమిటి అన్నది మరో వివాదమవు తుంది.).

విచిత్రమేమంటే పిఐబి ఏర్పాటు చేసిన కమిటీ పరివార్ ప్రచారాల జోలికి పోయిందే లేదు. వారు వెల్లడించిన, ఖండించిన కథనాలలో నూటికి తొంభై ప్రతిపక్షాలకు సంబంధించినవే. రాహుల్ గాంధీ యాత్ర సందర్భంలో ఫోటోలు లేదా ప్రకటనలు, ఇతర ప్రతిపక్షాలు లేదా మీడియా సంస్థలు కథనాలు సమాచారాలపైనే ఎక్కడలేని కేంద్రీకరణ చూపించడం అనుభవంలో చూశాం. పిఐబి అనేది మౌలికంగా ప్రభుత్వ విధానాలను లేదా కృషిని ప్రజలకు మీడియాకు తెలియజేయడానికి ఉద్దేశించిన సంస్థ. ఆ సంస్థ ప్రచారంలో పెట్టే విడుదల చేసే ప్రకటనలు ఎంత వరకూ నిజమని తేల్చవలసిన బాధ్యత మీడియా పైన సోషల్ మీడియా పైన ఇంకా ప్రతిపక్షాలు ప్రజా సంస్థల పైన వుంటుంది. దీన్ని అటూ ఇటూ తిప్పి తక్కిన వారిపై నిఘా వేసి కంటెంటు తొలగించే అధికారాలివ్వడం తలకిందులు తర్కం. ఉదాహరణకు ఇటీవల ప్రధాని విశాఖ పర్యటనకు వచ్చినపుడు జరిగిన కార్యక్రమాలలో తొంభై శాతం శంకుస్థాపనలు మాత్రమే. ఆ విషయం గట్టిగా చెబితే పిఐబి దాడి చేస్తుంది. ఎందుకంటే ఆ శంకుస్థాపనలు అంచనాల మొత్తంవారు అభివృద్ధి కింద చూపిస్తుంటారు. 'ఊరి' సైనిక కేంద్రంపై దాడి, పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ వంటి వాటిపై విపరీత ప్రచారం జరుగుతుంది. వాటికి సంబంధించిన నిజానిజాలు అడిగితే దేశభద్రతకు ముప్పంటారు. ఇంకా చెబితే దేశద్రోహం ముద్ర వేస్తారు. భారత్-చైనా సరిహద్దులలో పరిస్థితిపై ఏవో కథనాలు వస్తాయి. పూర్తి వివరాలు అడిగితే దాటేస్తారు. ప్రత్యారోపణలు చేస్తారు. ఇలాంటి అనేక సందర్భాలు చూశాం. అసలు పరిశోధనాత్మక జర్నలిజంలో జరగాల్సిందే అది. మోడీ ప్రభుత్వం క్రమంగా ఆ విధమైన పరిశోధనాత్మక జర్నలిస్టులనే వేటాడి ద్రోహుల జాబితాలో చేర్చింది. సర్వాధికారాలు పిఐబికి కట్టబెట్టే కొత్త నిబంధనలు వస్తే గనక ఏలినవారు చెప్పే అసత్య కథనాలు, లేనిపోని గొప్పలే జనానికి వార్తలవుతాయి. ప్రశ్నించడం పరిశోధించి రాయడం అపరాధమవుతుంది. పిఐబి వాటిని తొలగించాలని ఆదేశిస్తుంది. అంటే ఏ ప్రభుత్వ నిర్వాకాలనూ నిజాలనూ మీడియాలో సోషల్ మీడియాలో నిగ్గు తేల్చడం జరగాలో అదే తీర్పరిగా, నియంత్రణకర్తగా మారిపోతుంది. విడుదల చేసిన ముసాయిదాలో దానిపై నిర్దిష్టమైన కొలబద్దలు కూడా లేవు.

తస్మాత్ జాగ్రత్త

ఈ కారణంగానే ప్రతిపక్షాలూ మీడియా సంస్థలూ పత్రికా యాజమాన్యాలు, ముక్తకంఠంతో ఒక్క గొంతుతో సమాచార స్వాతంత్ర్యం మెడపై కత్తి లాంటి ఈ సవరణలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాయి. ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్ (ఎన్‌బిడిఎ), ది ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్‌ఎస్), అనేక జర్నలిస్టుల సంఘాలు ఈ మేరకు సవివరమైన సోదాహరణమైన ప్రకటనలు చేశాయి. ఒత్తిడి, విమర్శలు పెరిగాక కేంద్ర ప్రభుత్వ ఐటి శాఖామంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కొన్ని సన్నాయి నొక్కులతో కొన్ని వివరణలు ఇచ్చారు. ఈ విషయమై విడుదల చేసిన నిబంధనలపై ఫిబ్రవరిలో సంబంధిత సంస్థలతో (స్టేక్‌హోల్డర్స్) చర్చలు జరిపిన తర్వాతే అమలు లోకి తెస్తామన్నారు. ఇవి కేవలం కేంద్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించి మాత్రమే జరుగుతుందని ఆయా శాఖలతో నిర్ధారించుకున్నాకే వాటిని తొలగించడం జరుగుతుందని వివరించారు. ఈ సన్నాయి నొక్కులు ఎలా వున్నా దేశంలో ప్రస్తుత పరిస్థితి, ఆచరణను బట్టి చూస్తే నిస్సందేహంగా మోడీ ప్రభుత్వం మరోసారి సోషల్ మీడియా పీక నొక్కడానికి సమాయత్తం అవుతున్నదనేది స్పష్టం. కనీస పరిశీలన (స్క్రూటినీ) కూడా లేకుండా పిఐబి చెప్పిందే అమలు చేయవలసి వుంటుందని ఎన్‌డిబిఎ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వంపై ఏ విధమైన విమర్శ వచ్చినా ఏదో ఒక పేరుతో అణచివేయవచ్చు. పైగా డిజిటల్ సంస్థలూ ఇంటర్మీడియరీలు సర్కారు ఒత్తిడికి గురై తల వంచే పరిస్థితి దాపురిస్తుంది. అసలు ఇంత పెద్ద పరిణామం జరిగినా దేశంలో మీడియా సంస్థలైన పత్రికలు, ఛానళ్లలో పెద్దగా చర్చ లేకపోవడమే అందుకు నిదర్శనం. బడా మీడియా మోడీకి లోబడిపోయిన నేపథ్యంలో సోషల్ మీడియానే ప్రత్యామ్నాయంగా వుంది. దాంట్లో అనేక అవాస్తవాలు, అవాంఛనీయ ధోరణులు నిజమైనా అనేక వాస్తవాలు కూడా వెలుగు చూస్తున్నాయి. పైగా సోషల్ మీడియాలో పౌర చౌరవకూ పాత్రికేయుల స్వతంత్ర పాత్రకూ చోటుంటోంది. తప్పొప్పులు సరిచేయాలంటే మీడియా, సోషల్ మీడియాలో స్వీయ నియంత్రణా వ్యవస్థ ఏర్పాటు కావాలి గాని అధికార వర్గాలకు నిషేధాధికారాలు ఇవ్వడం అనర్థదాయకం. ఎమర్జన్సీలో విధించిన సెన్సార్‌ను మించిన స్వీయ సెన్సారింగ్ మీడియాలో సత్యాలను తొక్కి పడుతున్నదని ఇప్పటికే సాయినాథ్ వంటి వారు హెచ్చరించారు. ఈ సమయంలో మోడీపై బిబిసి డాక్యుమెంటరీని అడ్డుకున్న తీరు తాజాగా మన కళ్లెదుటే వుంది. ఈ కొత్త నిబంధనలు వాటన్నిటినీ హరించి వేయడమే గాక రాజ్యాంగం 19(1)(ఎ) అధికరణంలోని ప్రాథమిక హక్కులకూ భావ ప్రకటనా స్వేచ్ఛకూ ముప్పు తెస్తాయి. అందుకే ప్రజాస్వామ్య ప్రియులెవరైనా ఇందుకు వ్యతిరేకంగా ఎలుగెత్తి పోరాడాలి.

★

మందుల కంపెనీలు - నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ

విమర్శ

టి. కామేశ్వరరావు

గాంబియాలో 66 మంది పిల్లలకు మూత్రపిండాలు పాడై చనిపోయారు. దీనికి కారణం హర్యానా లోని 'మైడెన్ ఫార్మా' మందుల కంపెనీ తయారు చేసిన దగ్గు మందు. ఇందులోని డై ఇథలైన్ గ్లైకాల్, ఇథలిన్ గ్లైకాల్ అనే మందులు కలుషితం కావడంతో వీరు చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. ఈ విషయం సభ్య సమాజాన్ని కకావికలం చేసింది. హృదయ విదారకమైన ఈ సంఘటన ప్రపంచాన్ని కలచివేసింది. అదేగాక ఇండోనేషియాలో కూడా ఈ తరహా సంఘటన జరిగిందని వార్తలొచ్చాయి. మందులు కలుషితం కావడం, మోతాదుకు మించి ఉపయోగించడం, సరైన ప్రామాణికాలు పాటించకపోవడంతో ఈ ఘటనలు జరిగాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. ఈ దారుణాన్ని మర్చిపోకముందే ఉత్తరప్రదేశ్‌కు చెందిన మారియన్ బయోటిక్ ఫార్మా కంపెనీ తయారుచేసిన డాక్‌వన్ మ్యాక్స్ అనే కాఫ్ సిరప్ తాగడంతో గత డిసెంబరులో ఉజ్బెకిస్తాన్‌లో 18 మంది చనిపోయినట్లు వెలుగు లోకి వచ్చింది. దీంతో మందుల కంపెనీల ఎగుమతుల్లో భారత్ ప్రతిష్ట మసకబారేలా వుంది.

మన దేశంలోనూ అనేక ప్రాంతాల్లో ఈ తరహా సంఘటనలు చోటుచేసుకున్నాయి. కొద్ది సంవత్సరాల క్రితం విశాఖపట్నంలో మధుమేహ వ్యాధిగ్రస్తుడు రోజూ ఇన్సులిన్ తీసుకుంటున్నప్పటికీ, సుగర్ వ్యాధి నియంత్రణ లోకి రాలేదు. దాంతో వైద్యుడు అనుమానంతో ఇన్సులిన్ వైల్‌ను పరీక్షకు పంపించగా నిర్ఘాంతపోయే వాస్తవం బైటపడింది. వైల్‌లో ఇన్సులిన్ మందు బదులు డిస్టిల్ వాటర్ వున్నట్లు గుర్తించి దిగ్భ్రాంతి చెందారు. ఔషధ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. ఇటువంటి ఘటనలు అనేకం వున్నాయి. 1986లో దేశ ఆర్థిక రాజధాని ముంబయి లోని జెజె ఆస్పత్రిలో చోటుచేసుకున్న 14 మరణాలు దేశ ప్రజలను కలచివేశాయి. 10 నుంచి 76 ఏళ్ల వయసు కల్గిన ఈ 14 మంది మూత్రపిండాలు దెబ్బతిని చనిపోయారు. ప్రజలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో ఈ మరణాలపై ప్రభుత్వం కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. ఈ దుర్ఘటనపై ముంబాయి హైకోర్టు జడ్జి భక్తావర్ లెంటిన్‌తో స్వతంత్ర కమిషన్‌కు ప్రభుత్వం ఆదేశించింది. వివిధ స్థాయి అధికారులు ఈ కంపెనీ అవకతవకల్లో భాగస్వాములైనట్లు కమిషన్ గుర్తించింది. డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించింది. మందుల షాపులు, ఔషధ కంపెనీల్లోని లోపాల్ని ఎత్తిచూపింది. ముంబయి జనాభా అవసరాలకు మించి మందుల షాపులున్నట్లు తేల్చింది. ఈ సంఘటనతో అన్ని పార్శ్వాలను లెంటిన్ అధ్యయనం చేసి మందుల తయారీ నుంచి అమ్మకాల వరకు నియంత్రణ, పర్యవేక్షణ లోపాలపై ప్రభుత్వానికి స్పష్టమైన నివేదిక ఇచ్చారు. ఈ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించారు.

> ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం భారత ఔషధ నియంత్రణ వ్యవస్థను పటిష్టపరచాలి. ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చట్టాలకు మరింత పదును పెట్టాలి. నాసిరకం మందులు తయారుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకొనేలా వ్యవస్థలను బలోపేతం చేయనంతకాలం ప్రజల ప్రాణాలకు రక్షణ వుండదు. ప్రయివేటు మందుల ఉత్పత్తిదారులను ప్రోత్సహించి, ప్రభుత్వ రంగం లోని ఔషధ కంపెనీలను మూసివేసిన దుష్ఫలితాలు ఇప్పుడు ఈ రూపాల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి.

మందుల్లో 35 శాతం వరకు నాసిరకం, నకిలీ మందులు చలామణిలో వున్నాయని...2004లో అప్పటి కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో ప్రకటించారు. నాసిరకం మందుల తయారీదారులు, అమ్మకందారులను బహిరంగంగా ఉరితీయాలని ఆవేశంగా మాట్లాడారు. కానీ నాసిరకం మందుల తయారీదారులపై మోడీ ప్రభుత్వం ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పర్యవేక్షణ పెంచలేదు. ప్రాణాలను కాపాడ్డానికి ఔషధాలను తయారుచేసే ఫార్మా కంపెనీలు అధిక లాభాల కోసం మనుషుల ప్రాణాలను తీయడానికి సైతం సిద్ధపడుతున్నాయని ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి. ఫార్మా ఉత్పత్తులు, ప్రోత్సాహకాలపై ప్రభుత్వాలు దృష్టి పెడుతున్నాయి తప్ప వాటిలో నాణ్యతను పరిశీలించడంలేదు. ఉత్పత్తి సంస్థలు చేస్తున్న తప్పిదాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధపడటంలేదు. ఔషధ నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేయడంలేదు. యాభై ఔషధ కంపెనీలకు, రెండొందల మందుల షాపులకు ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వుండాలన్న సిఫార్సులను అమలు చేయడంలేదు. నాణ్యత, ప్రమాణాలను పరీక్షించాల్సిన సిబ్బంది లేకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో మందులు విచ్చలవిడిగా మార్కెట్లోకి చేరుతున్నాయి.

గాంబియాలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో భారత్‌కు చెందిన 16 మందుల కంపెనీల దిగుమతులపై నేపాల్ ప్రభుత్వం గత డిసెంబరులో నిషేధం విధించింది. ఇందులో రామ్‌దేవ్ బాబాకు చెందిన దివ్య ఫార్మసీ, పతంజలి ఉత్పత్తులు కూడా వున్నాయి. భారత్ లోని ప్రముఖ మందుల ఉత్పత్తి కంపెనీలు కూడా నిషేధిత జాబితాలో వున్నాయి. అనేకసార్లు అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేసిన భారత్‌కు చెందిన ప్రఖ్యాత కంపెనీల మందులు తరచూ వెనక్కి వస్తున్నాయి. నేపాల్ ప్రభుత్వం నిషేధించిన మందులు భారత్ మార్కెట్‌లో వినియోగంలో వున్నాయంటే, ప్రభుత్వం మందుల కంపెనీల పట్ల ఎంత ఉదారంగా వ్యవహరిస్తున్నదీ అర్థమవుతుంది.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం భారత ఔషధ నియంత్రణ వ్యవస్థను పటిష్టపరచాలి. ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చట్టాలకు మరింత పదును పెట్టాలి. నాసిరకం మందులు తయారుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకొనేలా వ్యవస్థలను బలోపేతం చేయనంతకాలం ప్రజల ప్రాణాలకు రక్షణ వుండదు. ప్రయివేటు మందుల ఉత్పత్తిదారులను ప్రోత్సహించి, ప్రభుత్వ రంగం లోని ఔషధ కంపెనీలను మూసివేసిన దుష్ఫలితాలు ఇప్పుడు ఈ రూపాల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ప్రయివేటు ఔషధ కంపెనీల మోసాలకు ప్రభుత్వాలు ముకుతాడు వేసి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. 'లెంటిన్' సిఫారసులను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలుచేయాలి.

/వ్యాసకర్త: ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్: 9985250991/

★

జనవాక్యం

సహ చట్టాన్ని నీరుగారుస్తున్నారు

ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తెచ్చేందుకు, అందుబాటులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు తెలియచెప్పేందుకు, పౌరులకున్న హక్కును చట్టబద్ధం చేసేందుకు సమాచార హక్కు (సహ) చట్టాన్ని తీసుకురావడం జరిగింది. దీనికోసం పెద్ద పోరాటమే జరిగింది. ఈ చట్టం రాకముందు ఆఫీస్‌కి వెళ్ళి బల్ల మీద చెయ్యి పెట్టడానికి కూడా వుండేది కాదు. ఈ చట్టం వచ్చిన తరువాత ఖచ్చితంగా అడిగిన సమాచారం ఇవ్వాల్సిన అవసరం వచ్చింది. పౌరునికి చదువు రాకపోయినా వారు కోరినవిధంగా అధికారులే ఫిర్యాదు రాసి అప్లికేషన్ పూర్తిచేసి పెట్టాలి. ఒకవేళ ఫిర్యాదులో అచ్చుతప్పులు దొర్లినా, భాషా పరిజ్ఞానం లేకపోయినా విషయం అర్థమైతే చాలు. సమాచారం ఇవ్వాలి. అలాంటి చట్టం వున్నప్పటికీ ఈరోజు అధికారులు కావలసిన సమాచారం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. కొంతమంది అధికారులు కావాలని, 'మీరు అడిగింది సెక్షను 8.1 లోకో రెండు లోకో వస్తుంది కనుక సమాధానం ఇవ్వం' అంటూ తప్పించుకుంటున్నారు. దేశ రక్షణకు సంబంధించినది అయితే ఇవ్వకూడదు. ఒక ప్రభుత్వ కార్యాలయంలో జరిగిన అవినీతి గురించి మీరేం చర్యలు చేపట్టారు, సదరు పని జరగకపోవటానికి కారణాలు తెలపండి అనడిగితే అవి చెప్పటానికి ఇష్టంలేక 'దీనికి సమాధానం మా కార్యాలయంలో లేదు. మా పరిధి లోకి రాదు' అని తిప్పి పంపుతున్నారు. వారి దగ్గర లేకపోతే ఎవరి దగ్గర వుందో, వారికి ఫిర్యాదు పంపి, ఐదు రోజుల లోపు ఆ సమాచారం ఫిర్యాదుదారునికి తెలపాలి. అంతేగాని ఇవ్వకుండా వుండకూడదు. దీనికంతటికి కారణం సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించిన వారిపైన ఆర్‌టిఐ కమిషన్ వారు సరైన చర్యలు తీసుకోకపోవటం. దీంతో అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చి సహ కార్యకర్తలను నిరుత్సాహ పరుస్తూ, చట్టాన్ని నీరుగారుస్తున్నారు. కనుక ఇకనైనా చట్టాన్ని, అందులోని సెక్షన్లను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకొని జరిమానా విధించాలి. అప్పుడే సహ చట్టం బతుకుతుంది.

- నార్నె వెంకట సుబ్బయ్య

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

ఎన్‌డి టివి నుండి నిష్క్రమించిన జర్నలిస్టు శ్రీనివాసన్ జైన్

న్యూఢిల్లీ : ఎన్‌డిటివి న్యూస్ ఛానెల్ అదానీ చేతుల్లోకి వెళ్లిన నుంచి అందులో పనిచేస్తున్న ఉద్యోగులతోపాటు కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారు కూడా ఆ ఛానెల్ నుండి వైదొలుగుతున్నారు. తాజాగా న్యూస్ యాంకర్ శ్రీనివాసన్ జైన్ కూడా ఈ ఛానెల్ నుండి వైదొలిగారు. ఈ సందర్భంగా ఆయన 'ఎన్‌డిటివిలో అద్భుతమైన మూడు దశాబ్దాల పరుగు ఈ రోజుతో ముగుస్తుంది. రాజీనామా నిర్ణయం అంత సులువు కాదు. కానీ.. అది అంతే'... అంటూ శ్రీనివాసన్ ట్వీట్ చేశారు.

రియాలిటీ చెక్, ట్రూత్ వర్సెస్ హైప్ వంటి కార్యక్రమాలకు శ్రీనివాసన్ యాంకరింగ్ చేశారు. ఈ ప్రోగ్రామ్స్ ద్వారా ఆయనకు మంచి గుర్తింపు లభించింది. అలాగే జర్నలిజంలో ఆయన చేసిన కృషికిగాను ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఎన్డీటివి అదానీ పరమైన వెంటనే ఎన్‌డిటివి వ్యవస్థాపకులు ప్రణయ్‌రాయ్, రాధికారాయ్ 2022 డిసెంబర్‌లోనే కంపెనీ బోర్డు నుండి వైదొలిగారు. ఆ తర్వాత జర్నలిస్ట్ రవీష్‌కుమార్, ఎన్డీటీవీ గ్రూప్ ప్రెసిడెంట్ సుపర్ణ సింగ్ తదితరులు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

నా హత్యకు కుట్ర : ఇమ్రాన్ ఖాన్ ఆరోపణ

లాహోర్ : ఉగ్రవాదులతో తనను హత్య చేయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీకే ఇన్సాఫ్ అధ్యక్షులు ఇమ్రాన్‌ఖాన్ ఆరోపించారు. ఈ కుట్ర వెనుక మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ పాత్ర ఉందని. ఇందుకోసం ఒక ఉగ్రవాద సంస్థకు భారీగా నగదు ఇచ్చారని కూడా ఆరోపించారు. ప్రభుత్వం నుంచి అక్రమంగా ఆర్జించిన సొమ్మును తనను చంపడానికి జర్దారీ ఉపయోగిస్తున్నారని తెలిపారు. గతంలో తనపై దాడికి కుట్ర పన్నిన వారికీ ఇందులో భాగస్వామ్యం ఉందని తెలిపారు. 'ఇప్పుడు ప్లాన్ 'సి' అమలు చేస్తున్నారు. దీని వెనుక ఆసిఫ్ జర్దారీ ఉన్నారు. అతని దగ్గర లెక్కలేనంత అవినీతి సొమ్ము ఉంది. ఆ డబ్బును ఆయన ఓ ఉగ్రసంస్థకు ఇచ్చారు. ఈ మొత్తం కుట్రలో శక్తిమంతమైన ప్రభుత్వ సంస్థ పాత్ర కూడా ఉంది' అని ఇమ్రాన్ ఖాన్ చెప్పారు.

గుజరాత్ జెయింట్స్ సలహాదారుగా మిథాలీ రాజ్

హైదరాబాద్: భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ మళ్లీ క్రికెట్‌లో రంగ ప్రవేశం చేయనుంది. బిసిసిఐ త్వరలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టే మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీకి సలహాదారుగా మిథాలీ వ్యవహరించనుంది. ఈ మేరకు గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం ఆదానీ స్పోర్ట్స్ లైన్స్ ఓ ప్రకటనలో సుదీర్ఘ కాలం మహిళా క్రికెట్‌లో రాణించిన ఒక ప్లేయర్ తమతో కలిసి పయనించేందుకు అంగీకరించినందుకు ధన్యవాదాలు అని పేర్కొనగా.. ప్రారంభ సీజన్‌లో ఆదానీ గ్రూప్స్ ఫ్రాంచైజీకి తనను మెంటార్‌గా ఎంపిక చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు అని మిథాలీ పేర్కొంది. మిథాలీ అరంగేట్రం వన్డేలో సెంచరీతోపాటు టి20ల్లో 17 అర్ధసెంచరీలు చేసింది. 2017లో భారత మహిళల జట్టు వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడంలో కీలకపాత్ర పోషించింది. అలాగే 2018 టి20 ప్రపంచకప్ సెమీస్‌కు చేరడంలోనూ మిథాలీ ముఖ్య భూమిక పోషించింది.

త్రిపురలో బిజెపికి ఎదురుదెబ్బ

- జాబితా విడుదల చేసిన కాషాయ పార్టీ
- అభ్యర్థులు దొంగలు.. గూండాలు అంటూ సొంత పార్టీ నేతల ఆందోళన
- పలు చోట్ల కార్యాలయాలు ధ్వంసం

బిజెపి కార్యకర్తల దాడిలో ధ్వంసమైన పార్టీ కార్యాలయం, బ్యానర్లు

అగర్తల : త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు జరగకుండానే బిజెపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల కోసం బిజెపి శనివారం అభ్యర్థుల జాబితాను విడుదల చేయగా, బిజెపి అభ్యర్థులు దొంగలు, గూండాలు, వివిధ కుంభకోణాల్లో నిందితులంలూ సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పార్టీ కార్యాలయాల వద్ద బిజెపి హఠావో – త్రిపుర బచావో అంటూ నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయాల వద్ద జెండాలను తొలగించి నిరసన వ్యక్తం చేశారు. పలు చోట్ల పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేశారు. అభ్యర్థుల జాబితా ప్రకటనతోనే నాయకులు మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరడంతో బిజెపి నాయకత్వం తలలు పట్టుకుంటుంది. మరోవైపు లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థులకు ప్రజల నుంచి భారీగా మద్దతు లభిస్తున్న సమయంలో బిజెపి అభ్యర్థులకు సొంత పార్టీ నాయకుల నుంచే తిరస్కరణ ఎదురవుతుండటంతో బిజెపి నాయకత్వానికి పరిస్థితి అయోమయంగా తయారయింది.

శనివారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బిజెపి విడుదల చేసింది. కేంద్రమంత్రి ప్రతిమా భౌమిక్‌ను ఈ ఎన్నికల్లో కాషాయ పార్టీ బరిలోకి దింపింది. త్రిపురలో మొత్తం 60 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 48 అభ్యర్థులతో బిజెపి తొలి జాబితా శనివారం ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సాహా టౌన్ బోర్డోవాలి నుంచి పోటీ చేస్తున్నారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి ప్రతిమా భౌమిక్ ధన్‌పూర్ నుంచి బరిలోకి దిగుతున్నారు. ప్రస్తుతం ఆమె త్రిపుర నుంచి ఎంపీగా ఉన్నారు. మిగతా 5 స్థానాలకు త్వరలోనే అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు బిజెపి వెల్లడించింది. బిజెపి మొత్తం 55 స్థానాల్లోనూ, దాని మిత్ర పక్షం ఐపిఎఫ్‌టి 5 స్థానాల్లోనూ పోటీ చేయనున్నాయి. మరోవైపు లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థులు 47 స్థానాల్లో బరిలోకి దిగుతున్నారు. ఇందులో 43 మంది సిపిఎం అభ్యర్థులు. మరో 13 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభయింది. నామినేషన్ల సమయంలో లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థులకు మద్దతుగా అన్ని నియోజకవర్గాల్లోనూ భారీగా ప్రదర్శనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు ఇందులో పాల్గొన్నారు.

త్రిపురలో ఫిబ్రవరి 16న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 2న ఫలితాలను వెల్లడించనున్నారు.

మొఘల్ గార్డెన్స్ పేరు మార్పు

న్యూఢిల్లీ : రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్స్ పేరును 'అమృత్ ఉద్యాన్'గా కేంద్ర ప్రభుత్వం మార్చివేసింది. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ అధికారులు వెల్లడించారు. 'అమృత్ ఉద్యాన్'గా పేరు మార్చిన ఈ గార్డెన్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. ప్రతి ఏటా నిర్వహించే 'ఉద్యానోత్సవం'లో భాగంగా ఈ ఏడాది జనవరి 31 నుంచి మార్చి 26 వరకు దాదాపు రెండు నెలలపాటు సందర్శకుల కోసం తెరిచి ఉంచనున్నారు. మార్చి 28 నుంచి 31 వరకు రైతులు, వికలాంగులు, మహిళలకు ప్రత్యేక సందర్శన ఉంటుందన్నారు. రాష్ట్రపతి భవన్‌లో 15 ఎకరాల్లో విస్తరించి ఉన్న గార్డెన్స్‌ను సాధారణంగా మొఘల్ గార్డెన్స్ పేరుతో ప్రాచుర్యం పొందింది. జమ్ముకాశ్మీర్‌లోని మొఘల్ గార్డెన్స్, తాజ్‌మహల్ వద్ద ఉన్న ఉద్యానం స్ఫూర్తిగా రాష్ట్రపతి భవన్‌లోని ఈ గార్డెన్‌ను ఆంగ్లేయుల కాలంలో తీర్చిదిద్దారు. అప్పటి నుంచి కూడా దీనిని మొఘల్ గార్డెన్స్‌గా ప్రజలు పిలుస్తున్నారు. దీనిని ప్రతీ ఏటా వసంతకాలంలో సాధారణ ప్రజల సందర్శనార్థం 'ఉద్యానోత్సవం' పేరుతో తెరుస్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తోన్న 'అమృత్ మహోత్సవ్' థీమ్‌కు అనుగుణంగా గార్డెన్స్ పేరును 'అమృత్ ఉద్యాన్'గా మార్చినట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ నవికా గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఇప్పటికే రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియా గేట్ వరకు విస్తరించిన రాజ్‌పథ్ పేరును కర్తవ్యపథ్‌గా కేంద్రం ఇప్పటికే మార్చివేసింది.

జార్ఖండ్‌లోని అగ్నిప్రమాదం

- ఆరుగురు మృతి

జార్ఖండ్ : జార్ఖండ్‌లోని ధన్‌బాద్ నగరంలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఇక్కడ ఒక ఆస్పత్రిలో మంటలు చెలరేగడంతో వైద్య దంపతులతో సహా ఆరుగురు మతి చెందారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. మతులను డాక్టర్ హజారా, ఆయన సతీమణి డాక్టర్ ప్రేమ హజారాగా గుర్తించారు. మతుల్లో యజమాని మేనల్లుడు సోహన్ ఖమారి, ఇంటి పనిమనిషి తారా దేవి, మరో ఇద్దరు ఉన్నారని పోలీసులు తెలిపారు. హాస్పిటల్ కాంప్లెక్స్‌లోనే వారి ఇళ్లు కూడా ఉందని వెల్లడించారు. ఆస్పత్రిలోని రోగులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదన్నారు.

సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం ప్రారంభం

సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం కొల్‌కతాలో శనివారం ప్రారంభమయింది. ఈ సమావేశం సోమవారం వరకూ జరగనుంది.

అమెరికా పోలీసుల చేతిలో మరో నల్లజాతీయుడు బలి

వాషింగ్టన్ : అమెరికా పోలీసులు మరో నల్లజాతీయుడిని బలి తీసుకున్నారు. 2020 మే నెలలో జార్జిఫ్లాయిడ్ అనే నల్ల జాతి యువకుడి గొంతుపై మోకాలితో అదిమి ఊపిరాడకుండా చేసి చంపిన శ్వేత జాతి దుర్హంకార పోలీసు అధికారి ఉదతం సంఘటన ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా ఆ ఘటనను తలపించే విధంగా ఈ నెల 7న ఈ సంఘటన జరిగింది. అమెరికా పోలీసులు 7న రాత్రి టైర్ నికోలస్ (29) అనే యువకుడిని పట్టుకుని రోడ్డుపై చితకబాదారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నికోలస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 10 తేదీన మృతి చెందాడు. నికోలస్‌ని పోలీసులు తీవ్రంగా గాయపరిచే దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన నాలుగు వీడియోలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఆ వీడియోల్లో పోలీసులు నికోలస్‌ని పట్టుకుని చితకబాదు తున్నారు. ఆ సమయంలో నికోలస్ నేనేమీ చేయలేదు అంటున్నా... వినకుండా పోలీసులు అతన్ని కొడుతూనే ఉన్నారు. ఇక మరో వీడియోలో పోలీసుల నుంచి నికోలస్ తప్పించుకుని పారిపోతుంటే.. అతన్ని పట్టుకుని పెప్పర్ స్ప్రేని ఉపయోగించారు. ఇంకో వీడియోలో నికోలస్ 'అమ్మా అమ్మా' అని అరవడం వీడియోలో వినిపిస్తుంది. వీడియోలో ఓ పోలీసు అధికారి బ్లాక్‌మెన్ అని అంటున్న మాటలూ వినిపిస్తాయి. ఈ వీడియోల్లోని పోలీసుల తీరును చూసిన ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నికోలస్ మృతికి బైడెన్ సంతాపం వ్యక్తం చేశారు. అతని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నికోలస్ మృతి పట్ల అతని తల్లి రోవ్‌వాన్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... 'నా కుమారుడిని పోలీసులు నుజ్జు నుజ్జుగా కొట్టడం తెల్లజాతీయుల పరువు తీయడమే' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. అయితే నికోలస్ మద్యం సేవించి డ్రైవ్ చేయడం వల్లే తనను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వాదనపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు తన కుమారుడు మద్యం సేవించారని అబద్ధాలు చెబుతున్నా రని ఆమె ఆరోపించారు. కాగా, ఈ ఘటనపై మెంఫిస్ పోలీస్ చీఫ్ సెరెలిన్ డేవిస్ 1991 రోడ్నీ కింగ్ ఘటనతో పోల్చారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా లాస్ ఏంజెల్స్‌లో కొన్నిరోజుల పాటు నిరసనలు జరిగాయి. ఈ నిరసనల్లో దాదాపు 12 మంది పౌరులు మృతి చెందారు..

లాస్ ఏంజెల్స్‌లో కాల్పులు

- ముగ్గురి మృతి

లాస్ ఏంజెల్స్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి విస్తరిస్తూనే ఉంది. తాజాగా లాస్ ఏంజెల్స్ నగరంలో జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. లాస్ ఏంజెల్స్ పట్టణంలోని బావేర్లీ క్రెస్ట్ ప్రాంతంలో శనివారం ఈ ఘటన జరిగింది. కాగా, ఈ నెలలో కాలిఫోర్నియా రాష్ట్రంలో ఇది మూడో ఘటన. ఆదివారం కాలిఫోర్నియాలోని ఒక డ్యాన్స్ స్కూల్ ఆవరణలో జరిగిన కాల్పుల్లో తొమ్మిది మంది మరణించారు. ఒక రోజు తరువాత శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన కాల్పుల ఘటనలో ఏడు మంది హతమయ్యారు.

లండన్‌లో రికార్డు స్థాయిలో పెరిగిన ఇంటి అద్దెలు

లండన్ : ఇంగ్లండ్ రాజధానిలండన్‌లో ఇంటి అద్దెలు రికార్డుస్థాయిలో పెరుగుతున్నాయి. దీంతో అక్కడి ప్రజలు బెంబేలెత్తుతున్నట్లు స్థానిక మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే లండన్‌వాసులు జీవన వ్యయంతోపాటు, విద్యుత్ ఛార్జీల పెంపుదలతో సతమతమవుతున్నారు. తాజాగా గృహ యజమానులు గతేడాది కంటే ఈ ఏడాది ఇంటి అద్దెలు పెంచడానికి మొగ్గుచూపుతున్నారని టెలిగ్రాఫ్ నివేదిక వెల్లడించింది. లండన్‌లో గతేడాది నాలుగో త్రైమాసికంలో రూ. 2,50,000 ఉన్న ఇంటి అద్దె ఈ ఏడాది ప్రారంభంలో 3,000,00 లక్షలకు పెరిగే అవకాశమున్నట్లు టెలిగ్రాఫ్ నివేదిక పేర్కొంది. కాగా, గతేడాది లండన్ కాకుండా.. మిగతా దేశాల్లో ఇంటి అద్దెలు 9.7 శాతం పెరిగాయని న్యూస్ అవుట్‌లెట్ నివేదించింది. ఇక లండన్‌లో 2021 తర్వాత ఇంటి అద్దెలు 9.9 శాతంతో రెండవ అత్యధిక వార్షిక వృద్ధిని నమోదు చేసినట్లు న్యూస్ అవుట్‌లెట్ పేర్కొంది. ఇంటి అద్దెలు విపరీతంగా పెరగడం తో.. అద్దెదారులు చాలా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గృహ యజమానులు అద్దెను పెంచే అభిప్రాయాన్ని మార్చుకోవాలని ప్రాపర్టీ సైన్స్ డైరెక్టర్ టిమ్ బన్నిస్టర్ అన్నారు.

జెరూసలేంలో కాల్పులు

- ఏడుగురు మృతి

జెరూసలేం : ఇజ్రాయెల్ రాజధాని జెరూసలేంలో జరిగిన దాడుల్లో ఏడుగురు మృతి చెందారు. ఈ ఘటనలో పదుల సంఖ్యలో గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో జెరూసలేంలోని నెవ్ యాకోవ్ బౌలేవార్డ్‌లోని యూదుల ప్రార్థనామందిరం సమీపంలో ఒక సాయుధుడు ఆ ప్రాంతంలోని ప్రజలపై కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసు బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిపై ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఏడుగురు మృతి చెందినట్లు పోలీసు అధికారి మీడియాకు వెల్లడించారు. ఆ వ్యక్తి కూడా వాహనాన్ని పోలీసులు ధ్వసం చేశారు. ఈ కాల్పుల్లో 10 మందికి గాయాలయ్యాయి. గాయాలైన వారిలో 70 ఏళ్ల వృద్ధుడు, 14 ఏళ్ల బాలుడు కూడా ఉన్నాడని మాగెన్ డేవిడ్ అడోమ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఏజెన్సీ (ఎండిఎ) వెల్లడించింది.

స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో సామాన్యులు

వారందరి గురించి నేటితరం తెలుసుకోవాలి : సాయినాథ్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బ్రిటీష్ సామ్రాజ్యవాద వలస పాలన నుంచి దేశ విముక్తి కోసం ఎంతోమంది సామాన్యులు పోరాడారని ప్రముఖ పాత్రికేయులు, రచయిత పాలగుమ్మి సాయినాథ్ తెలిపారు. వారందరి గురించి నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్' కోర్ కమిటీ సభ్యులు సునీతా రెడ్డి, సాయినాథ్ రచించిన ది లాస్ట్ హీరోస్ ఫుట్ సోల్జర్స్ ఆఫ్ ఇండియన్ ఫ్రీడం పుస్తక విశేషాలపై శనివారం ఇష్టాగోష్టి జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సాయినాథ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు నిర్వహించిందని, అయితే ఆ కార్యక్రమం ద్వారా నేటితరానికి స్వాతంత్ర్య సమరయోధుల గురించి అవగాహన కల్పించలేకపోయిందని అన్నారు. అల్లూరి సీతారామరాజు, మల్లు స్వరాజ్యం వంటి వారు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ధీరోదాత్తమైన పోరాటాన్ని నిర్వహించారన్నారు. ఒడిశాలోని బార్గా జిల్లా పానీమోరా ప్రాంతంలో 42 మంది సామాన్యులు పోరాడారని గుర్తు చేశారు. మల్లు స్వరాజ్యం లాంటి వారు తుపాకులు పట్టి పోరాటం నిర్వహించారని, రజాకార్లకు దీటుగా నిలబడిన వీరవనిత ఆమె అని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటం పిడికెడు మందికి పరిమితమైంది కాదనీ, రైతులు, కూలీలు, గృహిణులు, అటవీ ఉత్పత్తులపై ఆధారపడిన వారు సైతం తమతమ పరిధుల్లో బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా నిలబడ్డారన్నారు. గాంధీయన్లతోపాటు వామపక్షవాదులు, అంబేద్కరిస్టులు, ఆదివాసీలు, దళితులు, ఒబిసిలు, బ్రాహ్మణులు, ముస్లిములు, సిక్కులు, హిందువులు అలా అందరూ పోరాటంలో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. 1947 తర్వాత తరానికి ఈ వాస్తవాలు తెలియాల్సిన అవసరముందన్నారు. 'ఆజాదీ' అని నినదించినందుకు ఐదుగురు విద్యార్థులను ఏడాది పాటు జైలుకు పంపిన కేంద్రంలోని బిజెపి సర్కారు 'ఆజాదీ' అనేది తమ ఆస్తి అయినట్టు ఉత్సవాలు నిర్వహించిందని ఎద్దేవా చేశారు. దామోదర వినాయక సావర్కర్ జైలుకెళ్లేంత వరకూ విప్లవ భావాలు కలిగే ఉన్నారని, అనంతరం బ్రిటీష్ ప్రభుత్వంతో రాజీ పడ్డారని తెలిపారు. తనను క్షమిస్తే తప్పుదోవ పట్టిన యువతను తిరిగి బ్రిటీష్ వారికి అనుకూలంగా నడిపిస్తానంటూ నాటి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. సావర్కర్ రాసిన ఏడు ఉత్తరాల్లో ఐదు ఉత్తరాలు నేషనల్ ఆర్కైవ్‌లో ఇప్పటికీ ఉన్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పోరాడిన వారిని పట్టుకున్న పోలీసులకు పేర్లు చెప్పేందుకు నిరాకరిస్తే వారి పేర్లను ఎ, బి, సి, డిగా రాసుకున్నారని, వారిని జైలులో ఉంచేందుకు జైలరు కూడా అనుమతించలేదని వివరించారు. ప్రజలు తమ చరిత్రను తాము చదువుకోవాలని, నిజమైన చరిత్రను తెలుసుకునేందుకు స్వాతంత్ర్య సమరయోధులను కలుసుకుని వారితో ముచ్చటించాలని సూచించారు. ఆ పోరాట వాస్తవ చరిత్రను చెప్పేందుకే తాను పుస్తకం రాసినట్టు తెలిపారు.



ఎన్‌టిపిసికి రూ.44,989 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని దిగ్గజ విద్యుత్ కంపెనీ ఎన్‌టిపిసి 2022–23 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 5శాతం వృద్ధితో రూ.4,854.36 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.4,626.11 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.33,783.62 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో ఇది రూ.44,989.21 కోట్లకు చేరింది. మధ్యంతర డివిడెండ్ కింద రూ.10 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.4.25 లేదా 42.50 శాతం కేటాయించడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు మద్దతును తెలిపారు. 2022 డిసెంబర్ ముగింపు నాటికి రోజుకు 78.64 బిలియన్ యూనిట్లను ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది.

ఢిల్లీ మద్యం కుంభకోణంపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఇడి) దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జ్ షీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై (కాంగ్నిజెంట్) విచారణను సిబిఐ స్పెషల్ కోర్టు వాయిదా వేసింది. ఈ అంశంపై ఫిబ్రవరి 2న విచారణ చేపడతామని రౌస్ ఎవెన్యూ లోని సిబిఐ ప్రత్యేక కోర్టు పేర్కొంది. మద్యం కుంభకోణంలో మనీల్యాండరింగ్ సెక్షన్ల కింద ఈనెల 6న ఈడి 13,657 వేల పేజీలతో సప్లమెంటరీ ఛార్జ్ షీట్ ను దాఖలు చేసింది. 428 పేజీలతో ఈడీ కంప్లైంట్ కాపీని న్యాయమూర్తికి సమర్పించింది. ఈ ఛార్జ్ షీట్ లో ఐదుగురు నిందితులు, ఏడు కంపెనీలపై ఈడి అభియోగాలు మోపింది. రాబిన్ డిస్టిల్లరీస్ డైరెక్టర్ అభిషేక్ బోయిన పల్లి, అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి, ఇండోస్పిరిట్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ మహేంద్రు, ఆప్ కమ్యూనికేషన్ ఇంచార్ విజయ్ నాయర్, బిజినెస్ మెన్ బినోయ్ బాబుల, అమిత్ అరోరా పేర్లను నిందితులుగా చేర్చింది. కాగా, ఈ సంప్లమెంటరీ ఛార్జ్ షీట్ పై విచారణ శనివారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎంకె నాగ్ పాల్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అయితే ఈ అనుబంధ ఛార్జ్ షీట్ ను పరిగణలోకి తీసుకోవాలా? వద్దా అనే అంశంపై ఫిబ్రవరి 2న విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

కంపెనీ ఒప్పందాలు బయటపెట్టొద్దు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కంపెనీ ఒప్పందాలను బయటకు వెల్లడించవద్దని నిందితుల్లో ఒకరైన సమీర్ మహేంద్రు సిబిఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై సమీర్ మహేంద్రు తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అభియోగాల పత్రంలో సమాచారం బయటకు వెళితే తమ వ్యాపారాలకు ప్రమాదం వస్తుందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు దర్యాప్తు సంస్థలు సేకరించిన దాదాపు 1,97,000 మెయిల్స్ ను ప్రత్యర్థులు ఉపయోగించే అవకాశం ఉందన్నారు. తన క్లైంట్ కంపెనీ వ్యక్తిగత సమాచారం బయటపెట్టడానికి అనుమతించవద్దని కోర్టుకు నివేదించారు. రహస్య ఒప్పందాలు లీక్ అయితే లీగల్ సమస్యలు వస్తాయన్నారు. అయితే సమీర్ మహేంద్ర విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి నాగ్ పాల్, అందుకు అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. కంపెనీ ఒప్పందాలను బహిర్గతం చేయవద్దని ఇడిని ఆదేశించారు.

జోడో యాత్రకు భద్రత కల్పించాలి

- అమిత్‌షాకు ఖర్గే లేఖ

న్యూఢిల్లీ : జోడో యాత్రలో రాహుల్‌గాంధీకి భద్రత కల్పించే విషయంపై స్వయంగా జోక్యం చేసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. 'రాబోయే రెండు రోజుల్లో ఈ యాత్రకు భారీ సంఖ్యలో జనం తరలిరానున్నారు. జనవరి 30వ తేదీన జరిగే ఈ యాత్ర ముగింపు కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలతోపాటు, ఇతర పార్టీల నేతలు హాజరవుతున్నారు. శ్రీనగర్‌లో జరిగే యాత్ర కార్యక్రమం ముగిసేవరకు తగిన భద్రత కల్పించాలని, ఈ విషయంలో మీరు స్వయంగా సంబంధిత అధికారులకు సలహా ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఈ యాత్రలో పూర్తిగా భద్రతా వైఫల్యం కనిపిస్తోందని ఆరోపిస్తూ, శుక్రవారం యాత్రను రాహుల్‌గాంధీ నిలుపు చేసిన సంగతి తెలిసిందే.

కాగా, శనివారం ఉదయం ప్రారంభమైన జోడోయాత్రలో సంబంధిత అధికారులు భద్రతపై దృష్టి పెట్టలేదని స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ... 'ఈ యాత్రలో జనాన్ని మేనేజ్ చేయాల్సిన వారు ఎక్కడా కనిపించట్లేదు. మేం చేస్తున్న సిఫార్సులకు వ్యతిరేకంగా భద్రతా సిబ్బంది వెళుతున్నట్లు కనిపిస్తోంది' అని అన్నారు. అమిత్‌షాకు లేఖ రాసినప్పటికీ భద్రత కల్పించకపోవడంపై కాంగ్రెస్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా, శనివారం యాత్రలో ప్రియాంక గాంధీ పాల్గొన్నారు.

మహిళల ఛాంప్ సబలెంకా

- హోరాహోరీ ఫైనల్లో రైబకినాపై గెలుపు
- నేడు పురుషుల సింగిల్స్ టైటిల్ పోరు
- ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను బెలారస్‌కు చెందిన 5వ సీడ్ అర్యానా సబలెంకా కైవసం చేసుకుంది. శనివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో సబలెంకా 4–6, 6–3, 6–4తేడాతో 22వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన ఎలేనా రైబకినాపై విజయం సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన మూడుసెట్ల పోరులో అంతిమ విజేతగా సబలెంకా నిలిచింది. ఈ ఏడాదిలో సబలెంకా వరుసగా 11 మ్యాచుల్లో విజయాలతో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్(బెలారస్) తర్వాత రెండో ర్యాంక్‌కు ఎగబాకనుంది. ఐదోసీడ్‌గా బరిలోకి దిగిన సబలెంకా తొలిసెట్‌ను ఓ దశలో 3–1 ఆధిక్యతలో నిలిచినా.. రైబకినా ఆ తర్వాత పుంజుకోవడంతో 4–4తో సమం చేసింది. ఆ తర్వాత రైబకినా ఆ సెట్‌ను చేజిక్కించుకోవడం విశేషం. దీంతో తేరుకున్న సబలెంకా ఆ తర్వాత రెండు, మూడు సెట్‌లలో భారీ సర్వీసులతో రైబకినాపై ఎదురుదాడికి దిగింది. రెండో సెట్‌లో 5–3 ఆధిక్యతలోకి వచ్చి ఆ సెట్‌ను 6–3తో ముగించింది. ఇక మూడో సెట్‌లో ఒక్క బ్రేక్ పాయింట్ సాధించి ఆ సెట్‌ను 6–4తో కైవసం చేసుకొని టైటిల్ విజేతగా నిలిచింది. టైటిల్ గెలిచే క్రమంలో సబలెంకా 17 ఏస్‌లను సంధించడం విశేషం. సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలిచి తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. అంతకుముందు, ఆమె 2021లో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలుచుకుంది. 2019 యుఎస్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలవడంతో సబలెంకా ప్రపంచ మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో రెండోస్థానానికి చేరనుంది. విజేతగా నిలిచిన సబలెంకాకు భారత కరెన్సీలో సుమారు రూ.17.34కోట్లు లభించడంతోపాటు 2000 ఏటిపి పాయింట్లు కూడా లభించాయి. ఇక రన్నరప్‌గా నిలిచిన రైబకినాకు రూ.9.47కోట్ల రూపాయలతోపాటు 1300 ఏటిపి పాయింట్లు దక్కాయి.

నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్..

ఆస్ట్రేలియా ఓపెన్‌లో పురుషులు సింగిల్స్ ఫైనల్ ఆదివారం జరగనుంది. 4వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్, 3వ సీడ్ గ్రీక్‌కు చెందిన సిట్సిపస్ ఫైనల్లో తలపడనున్నారు. జకోవిచ్ టైటిల్ గెలిస్తే రికార్డుస్థాయిలో 23 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ సరసన చేరనున్నాడు.

సబలెంకా టైటిల్ గెలిచిందిలా..

ఫైనల్: రైబకినా(5)పై4–6, 6–3, 6–4, **సెమీస్ :** లినెట్టెపై 7–6(7–1), 6–2, **క్వార్టర్స్ :** వేకిక్ 6–3, 6–2, **ప్రిక్వార్టర్స్ :** బెన్సిక్(12)పై 7–5, 6–2, **మూడోరౌండ్ :** మెర్టెన్స్(26)పై 6–2, 6–3, **రెండోరౌండ్ :** రోజెర్స్‌పై 6–3, 6–1, **తొలిరౌండ్ :** మార్టిన్‌కోవా 6–1, 6–4

మీకోసం

కారం ఎక్కువ కాలం తాజాగా ఉండాలంటే అందులో ఇంగువ కలుపుకోవాలి.

జీవన సౌరభం

లక్ష్యాన్ని సాధించలేని జ్ఞానం నిరుపయోగమైనది.

ప్రతి విద్యార్థి చేతికీ ఓ కథల పుస్తకం!

ఆ స్కూల్లో విద్యార్థులే గ్రంథాలయం నిర్వహిస్తారు. దీనికొక బృందం ఏర్పడింది. ప్రతి శనివారం ఒక్కో విద్యార్థికి రెండు పుస్తకాలు ఇవ్వడం, ఆ విషయం రిజిస్టర్‌లో నమోదు చేయడం, చదివిన పుస్తకాలను తిరిగి తీసుకొని గ్రంథాలయంలో భద్రపర్చటం ... ఈ బృందం బాధ్యత. ఇదంతా క్రమబద్ధంగా జరగటం వల్ల ఈ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు చదవటం పట్ల ఇష్టం ఏర్పడింది. ఈ కార్యక్రమమంతా అక్కడి ఇద్దరు టీచర్ల ఆధ్వర్యంలో నడుస్తుంటుంది. మరి ఇదంతా ఎక్కడ జరుగుతుంతో తెలుసా? కృష్ణా జిల్లా విజయవాడ రూరల్ మండలం, వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో..

'పిజీఎన్‌ఎఫ్' ఎన్నారై సంస్థ నిర్వహిస్తున్న 'లెర్న్ అండ్ హెల్ప్' కార్యక్రమంలో భాగంగా రూ.15 వేల విలువైన పుస్తకాలు ఈ స్కూలుకు అందించారు. చదవటం రాని విద్యార్థులు కూడా బొమ్మల ఆధారంగా సులువుగా భాష అభివృద్ధి చేసుకోగలిగే విధంగా ఈ పుస్తకాలు ఉన్నాయి. ప్రతి పుస్తకం దేనికదే అద్భుతంగా, పిల్లల ఆసక్తిని పెంచే విధంగా ఉన్నాయి. దాంతో పిల్లలు, టీచర్లు ఉత్సాహంగా రిపబ్లిక్ డే నాడు 'గ్రంథాలయోద్యమం' అనే కార్యక్రమం నిర్వహించారు. 5 వ తరగతి విద్యార్థిని పాయల్ తయారుచేసిన Learn & help program బ్యానర్‌ను పెట్టారు. విద్యార్థులు తాము చేసిన కళాకృతులను ప్రదర్శనలో పెట్టారు. ఈ అమూల్యమైన పుస్తకాలను మూడు కిలోమీటర్ల పరిధిలో గల మూడు పాఠశాలలకూ ప్రతి నెలా అందించి, వారు చదివాక వెళ్ళి తెచ్చుకోవటం ఈ ఉద్యమం ముఖ్య ఉద్దేశం. బాలసాహిత్య రచయిత్రి, ఉపాధ్యాయురాలు మనోజ నంబూరి బాధ్యత వహిస్తున్నారు. ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకొస్తే 'ఆదివారం లైబ్రరీ పాయింట్' కూడా పెడతామంటున్నారు ఆమె.

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.



నేను గీసిన బొమ్మ

ఎస్. సుహాన,
6 వ తరగతి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,యాదమరి, చిత్తూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అకుంఠిత దీక్ష అతన్ని గెలిపించింది ..!

బాల్యంలో జరిగిన ప్రమాదంలో సునీల్ కుమార్‌కు రెండు చేతులూ, ఒక కాలు కోల్పోయాడు. 'జీవితాంతం ఒకరిపై ఆధారపడి బతకాల్సిందే... ఏ పని చేయలేడు. ఎందుకూ పనికి రాడు.. ఇటువంటి వాడు ఉంటే ఏంటి?... లేకపోతే ఏంటి?' అని అన్నారు కొందరు. అయినా తల్లిదండ్రులు ధైర్యం కోల్పోలేదు. మరింత ధీటుగా కొడుకును పెంచారు. అమ్మానాన్నలు ఇచ్చే శిక్షణతోనే అడుగడుగునా ఎదురయ్యే సవాళ్లను ఢీకొంటూ నిలబడ్డాడు సునీల్. మొండిచేతులతో పెన్ను పట్టుకుని రాయడమే కాదు బ్యాట్ పట్టుకుని క్రికెటూ ఆడుతున్నాడు. బ్యాంకు డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ చిన్నచూపు చూసిన వారిచేత శభాష్ అనిపించుకుంటున్నాడు.

నెల్లూరు జిల్లా వెంకటాచం మండలం, కాకుటూరు గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ గూడురు మండలంలో ఎస్‌బిఐ బ్యాంకులో ఏడేళ్లగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం అంటున్న సునీల్ మొండి చేతులతో కంప్యూటర్‌ను అలవోకగా టైప్ చేస్తున్నారు. ఇచ్చిన పనులను చకచకా పూర్తిచేసి తోటి ఉద్యోగులకు ప్రేరణగా నిలుస్తున్నారు. తన పట్ల తనకు పూర్తి విశ్వాసం ఏర్పడేలా మొదటి నుంచీ అతని తల్లిదండ్రులు, అన్న, స్నేహితులు మెసులుకున్నారు. దాంతో ఎక్కడికైనా ఒంటరిగా వెళతాడు. కఠిన పరిస్థితులను సైతం ఎదుర్కొని ఇచ్చిన పని చేసుకుని రాగలడు.

విద్యుద్ఘాతంతో ...

సునీల్‌కుమార్ తండ్రి సుధాకర్ ప్రభుత్వఉపాధ్యాయుడు. తల్లి సంపదలక్ష్మి గృహిణి. వీరికి ఇద్దరు మగపిల్లలు. సునీల్‌కుమార్ చిన్నవాడు. సుధాకర్‌కు క్రికెట్ అంటే ఇష్టం. సెలవు రోజుల్లో పిల్లలితో కలిసి క్రికెట్ ఆడేవారు. దాంతో పిల్లలకూ క్రికెట్ అంటే ఇష్టం ఏర్పడింది. సునీల్ నాలుగో తరగతి చదువుతున్నప్పుడు ఒక రోజు ఇంటి సమీపంలో తండ్రితో కలిసి క్రికెట్ ఆడుతున్నప్పుడు బాలు సన్‌షెడ్‌పై పడింది. దాన్ని తీసేందుకు టివి యాంటిన్నా ఉపయోగించి బయటకు తీశాడు సునీల్. ఆ క్రమంలో పైన ఉన్న11 కెవి కరెంట్ వైర్ యాంటిన్నాకు తగిలింది. దాంతో విద్యుద్ఘాతానికి గురయ్యాడు సునీల్. వెంటనే చెన్నైలో ఎఎంసి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి కుడి చెయ్యి, ఎడమ కాలు నరాలు బాగా దెబ్బతిన్నాయని, సగ భాగం వరకు కట్‌చేసి తీసేశారు. ఎడమ చేతిలో నరాలు కూడా దెబ్బతిన్నాయి. కాని ఏదో ఒక నరం పని చేస్తుందని ఆశతో ఉంచారు. కాని మూడు రోజుల తర్వాత ఎడమ చెయ్యి కూడా మోచేతి వరకూ తీసేయాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆపరేషన్ థియేటర్లో మొండి శరీరంతో... కట్లుతో, ఒంటి కాలుతో ఉన్న కొడుకును చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కాని కొడుకు ముందు ఏడిస్తే తానూ బాధపడతాడని ధైర్యంగా ఉన్నారు. వారు అంతటితో కొడుకు భవిష్యత్తు ముగిసిందనుకోలేదు. మనసులో దుఃఖం పొంగుతున్నా అణచుకున్నారు. బిడ్డకు మానసికస్థైర్యం పెంచేలా మాటలు చెప్పారు.

తల్లిదండ్రులే గురువులు

ఆసుపత్రిలో కదలలేని స్థితిలో మంచం మీద ఉన్న బిడ్డకు పెన్ను ఇచ్చాడు తండ్రి సుధాకర్. 'చదువుకోవాలని ఉంటే లే... లేచి పెన్ను పట్టుకుని రాయి' అన్నాడు. దాంతో సునీల్ లేచి పెన్ను పట్టుకుని, మందుల చీటీ మీద రాసే ప్రయత్నం చేశాడు. కాని చేతికి వేసిన కుట్లు పచ్చివి కావడంతో రక్తం కారిపోయింది. వేసుకున్న డ్రస్ మొత్తం రక్తపు మరకలతో తడిసింది. అయినా చదువుకోవాలన్న పట్టుదలతో పెన్ను పట్టుకునే ప్రయత్నం చేశాడు సునీల్. అది చూసిన వైద్యులు 'బాబూ.. నీవు రాస్తావు. బాగా చదువుతావు' అని ధైర్యం చెప్పారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన సునీల్‌ను చూసి బంధువులు నిరాశగా మాట్లాడటం మొదలుపెట్టారు. 'ఇక ఈ బిడ్డ జీవితం మంచానికే పరిమితం, జీవితాంతం తల్లి సేవలు చేస్తూ ఉండాల్సిందే' అని అనేవారు. కొందరైతే ఏదైనా విషం ఇచ్చి చంపేయమని సలహా కూడా ఇచ్చారు. ఈ మాటలతో తల్లిదండ్రులు కుంగిపోయారు. ఇవేమీ సునీల్ చెవిన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అందరిలా తన బిడ్డ అన్నీ పనులు చేసేలా శిక్షణ ఇవ్వాలనుకున్నారు. కృత్రిమ చేతులు పెట్టించుకోవాలని చెన్నై వెళ్లారు. అక్కడ కోల్పోయిన ఎడమ కాలికి కృత్రిమ కాలు అమర్చారు. దాంతో ఎవరీ సాయం లేకుండా సునీల్ నడవసాగాడు. కొడుకును చదివించాలన్న పట్టుదలతో తల్లి కొడుకు చేతికి హెయిర్‌బాండ్ పెట్టి, అందులో పెన్ను పెట్టి రాయమని పుస్తకం ఇచ్చింది. మొదటిరోజు అక్షరాలు పెద్దవిగా, పిచ్చి రాతగా కుదిరింది.

తర్వాత చేతికి ఎలస్టిక్ వేసి, అందులో పెన్సిల్, పెన్ను మార్చి పెడుతూ మూడు నెలలు ఇంట్లో రైటింగ్‌లో సాధన చేయించారు. క్రమంగా అతని చేతిరాతలో మార్పు వచ్చింది. ఆ తరువాత సునీల్ రైటింగ్ కాంపిటేషన్లో కూడా పాల్గొని థర్డ్ ప్రైజ్ గెలుచుకున్నాడు కూడా. దాంతో కృత్రిమ చేతులు పెట్టించుకోవాలన్న నిర్ణయాన్ని విరమించుకున్నారు. మొండిచేతులతోనే అన్ని పనులూ చేసుకునే స్థాయికి, ఇంట్లో సానుకూల వాతావరణం కల్పించారు. 'నువ్వు చేయగలవు' అని ప్రోత్సహించారు. దాంతో ప్రమాదం జరిగిన ఆరునెలలకే తిరిగి స్కూల్లో చేరాడు. పేజీలు తిప్పడం, పుస్తకం పట్టుకోవడం, బాక్సులో అన్నం తినడం, మంచినీళ్లు తాగడం వంటి పనులు ఎవరి సాయం లేకుండా సునీల్ చేసుకోవడాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. పదో తరగతి పరీక్షలు సైతం తానే రాయడం చూసి పరిశీలనకు వచ్చిన కలెక్టర్ మెచ్చుకున్నారు.

ఇంట్లోనే ల్యాబ్ ఎక్స్‌పర్‌మెంట్స్

ఇంటర్ తర్వాత సునీల్ ఎంసెట్ రాశాడు. తిరుపతిలోని ఓ ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాల్లో చదివాడు.ల్యాబ్ ఎక్స్‌పర్‌మెంట్స్ సునీల్ చేయలేడని మొదటి నుంచీ కిట్స్ ఇవ్వలేదు. దాంతో చివరి సంవత్సరం పరీక్షల్లో మార్కులు తగ్గిస్తామని చెప్పడంతో సునీల్ ఎదురుతిరిగాడు. 'అందరితో సమానంగా అన్ని ల్యాబ్ పరీక్షలు చేస్తాను' అని ప్రిన్సిపల్, వైస్ ఛాన్సులర్‌కు సవాల్ విసిరాడు. 'రెండు చేతులూ లేనివాడు ఈ కఠిన పరీక్షలు ఎలా చేస్తాడో చూద్దాం' అంటూ వారు వివాదానికి దిగారు. దాంతో తండ్రి సుధాకర్ ల్యాబ్‌లో ఉండే పరికరాలను బయట కొని ఇంటికి తీసుకువచ్చాడు. సునీల్ చేత ప్రాక్టీసు చేయించి, ల్యాబ్ పరీక్షలకు తీసుకెళ్లాడు. 18 ఎక్స్‌పర్‌మెంట్లు 3 రోజుల్లో చేసి చూపించాడు. ప్రొఫెసర్లు సైతం సునీల్ నమ్మకాన్ని చూసి ఆశ్చర్యపోయారు. తర్వాత బ్యాంకు కోచింగ్‌లో చేరాడు. ఉద్యోగం సంపాదించాలన్న కసితో కష్టపడి చదివాడు. దాంతో మంచి మార్కులతో గూడురు ఎస్‌బిఐ బ్యాంకులో ఉద్యోగం సంపాదించాడు. రెండేళ్లలోనే డిప్యూటీ మేనేజర్‌గా ప్రమోట్ అయ్యాడు.

'నన్ను చూసి చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుకుంటారు. ఆ పని ఎలా చేస్తాడు?' అనుకుంటారు. కుటుంబం అండగా ఉంటే ఎంతటి కష్టాన్నైనా దాటొచ్చు అనడానికి నేనూ, నా విజయం నిదర్శనం' అంటారు సునీల్‌కుమార్.

– పద్మావతి

క్రికెట్ జట్టు కెప్టెన్‌గానూ ...

ఏ ఆట వల్ల అయితే తన జీవితం మారిపోయిందో అదే ఆటలో రాణిస్తున్నాడు సునీల్. ప్రమాదం జరిగిన రెండేళ్ల తర్వాత అన్న వినోద్, స్నేహితుల ప్రోత్సహంతో క్రికెట్ వైపు మళ్లీ అడుగులు వేశాడు. వారు బాలు, బ్యాట్ ఎలా పట్టుకోవాలో చూపించారు. సునీల్ మొదట్లో బ్యాట్, బాలు పట్టుకోలేక పడిపోయేవాడు. అన్న వెన్నుతట్టడంతో ఆడేందుకు ప్రయత్నించాడు. ఇప్పుడు తన బ్యాటింగ్, బాలింగ్‌లలో గొప్పగా రాణిస్తూ... టీం కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. వివిధ టోర్నమెంట్లలో పాల్గొని బహుమతులూ సాధిస్తున్నాడు.

'బుట్టబొమ్మ' ట్రైలర్ విడుదల



బాలనటిగా చిత్రసీమకు పరిచయమైన అనిఖ సురేంద్రన్ తెలుగులో హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'బుట్టబొమ్మ'. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్.. సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో అర్జున్ దాస్, సూర్య వశిష్ట ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శౌరీ చంద్రశేఖర్ రమేష్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఫిబ్రవరి 4న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రం నుండి ట్రైలర్‌ను విడుదల చేశారు.

'నాని 30' అప్డేట్

నూతన దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వం వహిస్తున్న నాని 30వ చిత్రంపై తాజా అప్డేట్ ఒకటి బయటికి వచ్చింది. మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, మూర్తి కెఎస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ చిత్రం జనవరి 31న ప్రారంభంకానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఫిబ్రవరి 1 నుంచి సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో నానికి జోడీగా నటించనున్నారు.

పృథ్వీరాజ్ దర్శకత్వంలో 'కొత్త రంగుల ప్రపంచం'

ఇప్పటివరకు ప్రేక్షకులను తనదైన కామెడీతో మేనరిజంతో ఆకట్టుకున్న సీనియర్ నటుడు పృధ్వీరాజ్ దర్శకత్వం వహించిన సినిమా 'కొత్త రంగుల ప్రపంచం'. శ్రీ పిఆర్ క్రియేషన్స్ పతాకంపై పద్మ రేఖ, గుంటక శ్రీనివాస్ రెడ్డి, కుర్రి కృష్ణా రెడ్డి సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సందర్భంగా సినిమాకి సంబంధించిన గ్లిమ్స్ రిలీజ్ చేశారు మేకర్స్. కామెడీ, క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కినట్లు చూపించారు. ఇందులో పృధ్వీరాజ్, క్రాంతి కృష్ణ, శ్రీలు, విజయ రంగరాజు, అశోక్‌కుమార్ గోతాసింగ్ , అంబటి శ్రీను, జబర్దస్త్ నవీన్, గణపతి నటించారు.

'కోనసీమ థగ్స్' ట్రైలర్

డాన్స్ మాస్టర్ బృందా గోపాల్ తాజాగా రూపొందిస్తున్న చిత్రం 'థగ్స్'. తెలుగులో ఈ సినిమాకు 'కోనసీమ థగ్స్' అని పేరు పెట్టారు. తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం త్వరలో విడుదల కాబోతోంది. తాజాగా ఈ చిత్రం నుండి ట్రైలర్ విడుదల చేశారు. ఈ డిజిటల్ ట్రైలర్‌ను విజయ్ సేతుపతి, దుల్కర్ సల్మాన్, ఆర్య, అనిరుధ్, కీర్తి సురేష్ విడుదల చేశారు. రా యాక్షన్ ఫిల్మ్‌గా తెరకెక్కుతోన్న చిత్రాన్ని శిబు తమీన్స్ కుమార్తె రియా షిబు సమర్పిస్తూ, జీయో స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్నారు. తమీన్స్ కుమారుడు హ్రిదు హరూన్ హీరోగా దీనితో పరిచయం అవుతున్నారు. బాబీ సింహ, ఆర్.కె. సురేష్, మునిష్కంత్, శరత్ అప్పనీ, అనస్వర రాజన్ ముఖ్యపాత్రల్లో కనిపించబోతున్నారు.

'మైఖేల్' యూనివర్సల్ సినిమా

రంజిత్ జయకోడి దర్శకత్వంలో సందీప్ కిషన్ చేస్తున్న తాజా చిత్రం 'మైఖేల్'. విజయ్ సేతుపతి, వరలక్ష్మీ శరత్ కుమార్, దివ్యాంశ కౌశిక్, వరుణ్ సందేశ్, గౌతమ్ మీనన్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా ఫిబ్రవరి 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. 'ఇది చాలా ప్రత్యేకమైన చిత్రం. అద్భుతమైన నటీనటులు ఈ సినిమా కోసం కలసి వచ్చారు. మేమందరం కథని, దర్శకుడు రంజిత్‌ని బలంగా నమ్మాం. మా నమ్మకాన్ని ట్రైలర్‌కి వచ్చిన స్పందనే నిలబెట్టింది. కథ, కంటెంట్, ఫిల్మ్ మేకింగ్ పరంగా మైఖేల్ యూనివర్సల్‌గా రీచ్ అయ్యే సినిమా. తప్పకుండా అందరికీ నచ్చుతుంది' అని సందీప్ ఈ సందర్భంగా మాట్లాడారు. భరత్ చౌదరి, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ సినిమాని సంయుక్తంగా నిర్మించారు.

షెఫాలీ పైనే ఆశలు..

నేడు ఫైనల్లో ఇంగ్లండ్‌తో ఢీ
ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లో భారతజట్టు నేడు ఇంగ్లండ్‌తో తలపడనుంది. సెమీస్‌లో భారత జట్టు 8వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను, ఇంగ్లండ్ జట్టు 3పరుగుల తేడాతో పటిష్ట ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్లోకి దూసుకొచ్చాయి. తొలి సెమీస్‌లో న్యూజిలాండ్ జట్టు నిర్దేశించిన 108పరుగుల లక్ష్యాన్ని షెఫాలీ నేతృత్వంలో భారతజట్టు 14.2ఓవర్లలో కేవలం 2వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఆ మ్యాచ్‌లో పార్శవీ చోప్రా అద్భుత బౌలింగ్‌తో చెలరేగి న్యూజిలాండ్‌ను కట్టడి చేయడంలో సఫలమైంది.. మరో సెమీస్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు 99పరుగులకే ఆలౌట్ అయినా.. ఆస్ట్రేలియా జట్టును 96పరుగులకే ఆలౌట్ చేసి సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. ఫైనల్‌కు చేరే క్రమంలో భారతజట్టు ఆస్ట్రేలియా చేతిలో ఓటమి మినహా.. అన్ని మ్యాచుల్లోనూ విజయాలను నమోదు చేసుకుంది. భారత, ఇంగ్లండ్ కెప్టెన్లు ఇద్దరికీ సీనియర్ జట్టులో ఆడిన అనుభవముంది. ఈ టోర్నమెంట్‌లో ఇంగ్లండ్ జట్టు 100పరుగుల లక్ష్యాన్ని ఇచ్చి ఆస్ట్రేలియాపై, 103పరుగుల లక్ష్యాన్ని ఇచ్చి పాకిస్తాన్‌పై అద్భుత విజయాలను నమోదు చేసుకుంది. అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌కు ఐసిసి ప్రతిష్టాత్మకంగా తొలిసారి నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే.

భారత్(అండర్-19 మహిళలు): షెఫాలీ వర్మ(కెప్టెన్), త్రీషా, శిఖా షలోట్, శ్వేతా షెర్లావత్, సౌమ్య తివారి, హర్లీ గాలే, సోనియా మెంధియా, యశశ్రీ, హ్రిశితా బసు, రిచా ఘోష్(వికెట్ కీపర్లు), అర్చనా దేవి, ఫలక్ నాజ్, మనత్ కశ్యప్, నజ్లా నౌషాద్, పర్షవీ చోప్రా, షబ్నమ్, సోనమ్ ముఖేశ్, టిటాస్ సధూ.

ఇంగ్లండ్(అండర్-19మహిళలు): గ్రేస్ స్క్రివెన్స్(కెప్టెన్), ఛారిస్, డావినా, జమిమా, లిబర్టీ, హోలండ్, స్టోన్‌హౌస్, గ్రోవిస్, మెక్‌డొనాల్డ్, వార్డ్, సరెన్ స్మాలె (వికెట్ కీపర్లు), మిల్స్, లాంబర్ట్, అండర్సన్, ఛరమ్స్, బోకెర్, స్కాట్, టేలర్, సోఫియా.

దక్షిణాఫ్రికాపై గెలుపుతో భారత హాకీ జట్టుకు 9వ స్థానం

ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు 9వ స్థానంలో నిలిచింది. 9-12 స్థానాలకు శనివారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత్ 5-2గోల్స్ తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి భారత్ 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. ఆ రెండు గోల్స్‌ను తొలి క్వార్టర్‌లోనే వచ్చాయి. తొలి గోల్‌ను అభిషేక్(5వ ని.), రెండో గోల్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్(12వ ని.)లో పెనాల్టీని గోల్‌గా మలిచాడు. షంషేర్‌సింగ్(45వ ని), ఆకాశ్ దీప్ సింగ్(49వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. సుఖ్‌జీత్(59వ ని.)లో మరో గోల్ కొట్టినా.. దక్షిణాఫ్రికా తరఫున శ్యామ్‌కెలె(49వ ని.) ఒక గోల్‌ను కొట్టాడు. దీంతో 5-1 గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. మ్యాచ్ ముగియడానికి కొద్ది క్షణా ముందు దక్షిణాఫ్రికాకు పెనాల్టీ స్టోక్ లభించడంతో ఆ జట్టు మరో గోల్ చేసింది. దీంతో భారత్ 5-2గోల్స్ తేడాతో గెలిచింది. అంతకుముందు జరిగిన మరో వర్గీకరణ మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు 6-0గోల్స్ తేడాతో వేల్స్‌ను ఓడించింది. దీంతో భారత్, అర్జెంటీనా జట్లు 9వ స్థానంలో నిలువగా.. దక్షిణాఫ్రికా, వేల్స్ 11వ స్థానంలో నిలిచాయి.

నేడు బెల్జియం-జర్మనీ జట్ల మధ్య టైటిల్ పోరు

భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఆదివారం బెల్జియం-జర్మనీ జట్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన బెల్జియం జట్టు వరుసగా రెండోసారి ఫైనల్లోకి దూసుకురాగా.. జర్మనీ జట్టు అనూహ్య విజయాలతో ఫైనల్‌కు చేరింది. సెమీస్‌లో పటిష్ట ఆస్ట్రేలియాపై 4-3గోల్స్ తేడాతో గెలిచి జర్మనీ తుదిపోరుకు అర్హత సాధించింది. మరోవైపు బెల్జియం పెనాల్టీలలో 3-2గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. ఇక గ్రూప్-బి లీగ్ దశలో ఈ రెండుజట్లు ముఖాముఖి తలపడగా ఆ మ్యాచ్ 2-2గోల్స్‌తో డ్రా అయ్యింది.

టాపార్డర్‌పై దృష్టి..

నేడు న్యూజిలాండ్ రెండో టి20
రాత్రి 7.00గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

లక్నో: తొలి టి20లో అనూహ్యంగా ఓటమిపాలైన టీమిండియా.. నేడు న్యూజిలాండ్‌తో రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. మూడు టి20ల సిరీస్‌లో 0-1తో వెనుకబడ్డ భారతజట్టు ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్ రేసులో నిలవనుంది. ఆల్‌రౌండ్ హార్దిక్ పాండ్య నాయకత్వంలోని టీమిండియా రాంచీ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో 21 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. వాషింగ్టన్ సుందర్ అర్ధసెంచరీకి తోడు సూర్య కుమార్ కీలక ఇన్నింగ్స్ ఆడటం మినహా భారత బౌలింగ్ లైనప్ ఆశించినస్థాయిలో లేదు. టాపార్డర్, మిడిలార్డర్ బ్యాటర్స్ రాణిస్తేనే టీమిండియాకు గెలుపొందనుంది. రాంచీ మైదానం బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ.. తొలుత కివీస్‌కు ఎక్కువగా పరుగులు ఇవ్వడంతోనే లక్ష్య ఛేదనలో టీమిండియాకు కష్టంగా మారింది. టీమిండియా జట్టులో చాలామంది యువకులు ఉండగా.. తొలి మ్యాచ్ ఓటముల నుంచి పాఠాలను నేర్చుకొని ముందుకు సాగాల్సి ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68